కూటమిపై ఇంటి ఆశలు..!

స్థలంలేనివారు వేలల్లోనే.. ఏడేళ్లుగా నిరీక్షణ

- అద్దెలు కట్టలేక ఇబ్బందులు
- ఇళ్లు మంజూరు చేస్తుండటంతో స్థలాలు కూడా ఇస్తారని ఆశాభావం

కదిరి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): సొంతిల్లు అనేది పేదలకు కల. అలాంటి కలను నెరవేరుస్తామని గత వైసీపీ పాలకులు ఆశలు రేపారు. ఇల్లు సిద్ధం చేసి, తాళం ఇస్తామని నమ్మబలికారు. దీంతో పేదలు సంబరపడ్డారు. దరఖాస్తు చేసుకున్నాక.. గత పాలకులు వింత షరతులు పెట్టారు. సెంటు స్థలమే ఇచ్చారు. అందులోనూ ఉచిత ఇల్లు హామీని గాలికొదిలేశారు. ఇల్లు కట్టుకుంటే బిల్లులిస్తామన్నారు. అలా కొందరు కట్టుకున్నా.. చాలామందికి బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నారు. దీంతో గత ఐదేళ్లూ పేదల సొంతింటి ఆశలపై నీళ్లు చల్లారు. ఈ నేపథ్యంలో గతేడాది కొలువుదీరిన కూటమి ప్రభుత్వంపై పేదలు కోటి ఆశలు పెంచుకున్నారు. స్థలం ఇచ్చి.. ఇల్లు మంజూరు చేయాలని కోరుతున్నారు. స్థలం ఉన్నవారికి ఏడాదిన్నరలో ఇళ్లు మంజూరు చేయడంతో వారిలో ఆశలు చెలరేగాయి. కూటమి ప్రభుత్వం స్థలం ఇచ్చి, ఇల్లు కట్టిస్తుందన్న ఆశతో ఉన్నారు.



స్థలంలేనివారు భారీ సంఖ్యలోనే..

నియోజకవర్గవ్యాప్తంగా స్థలంలేనివారు వేలల్లోనే ఉన్నారు. కొన్నేళ్లుగా ఇళ్లు మంజూరు చేయకపోవడంతో వీరి సంఖ్య పెరిగిపోయింది. స్థలంతోపాటు ఇంటికోసం ఎదురుచూసే వారు పట్టణంలో దాదాపు నాలుగువేల మంది ఉన్నారు. నల్లచెరువు 1,305, ఎన్పీ కుంట 738, తనకల్లు 4,463, కదిరి రూరల్ 766, గాండ్లపెంటలో 540 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇంకా దరఖాస్తు చేసుకోనివారు మరో ఐదువేల మంది వరకు ఉండే అవకాశం ఉంది. మొత్తం మీద ఇళ్లస్థలాలు లేనివారే ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. వీరందరూ స్థలాలతోపాటు ఇల్లు ఎప్పుడు మంజూరు చేస్తారని ఆశగా ఎదురు చూస్తున్నారు.

ఏడేళ్లుగా నిరీక్షణ

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఒకటిన్నర సంవత్సరం అవుతోంది. స్థలం ఉన్నవారికి ఇళ్లు మంజూరవుతున్నాయి. స్థలం లేనివారికి కావట్లేదు. దీంతో వేలాదిమంది సంవత్సరాలుగా ఎదురు చూస్తున్నారు. గత వైసీపీ పాలనలో పట్టణ ప్రాంతాల్లో సెంటు స్థలం ఇచ్చారు. మూడువేల ఇళ్లు మంజూరు చేస్తే, అనువుగానిచోట అవి ఉండడంతో కేవలం 800 లోపే ఇళ్లు నిర్మించుకున్నారు. మిగిలినవారు ఇళ్ల నిర్మాణానికి ముందుకు రాలేదు. గ్రామీణ ప్రాంతాలు, మండల కేంద్రానికి మూడు, నాలుగు కిలోమీటర్ల దూరంలో, గుట్టల్లో స్థలాలు ఇవ్వడంతో ఇంటి నిర్మాణాలు చేపట్టలేదు. తనకల్లు మండలకేంద్రానికి మూడు కిలోమీటర్ల దూరంలో జగనన్న కాలనీ ఏర్పాటు చేయడంతో ఒక మహిళ మాత్రమే ఇల్లు నిర్మించుకుంది. తలుపులలో ఇళ్ల నిర్మాణాలే చేపట్టలేదు. నంబులపూలకుంటలోనూ అదే పరిస్థితి నెలకొంది. గాండ్లపెంటలో గుట్టల్లో ఇవ్వడంతో ఎక్కువమంది నిర్మాణాలకు ముందుకు రాలేదు. ఇలా.. ఏడేళ్లుగా సొంతింటికోసం పేదలు ఎదురు చూస్తున్నారు.

అద్దె ఇళ్లలో అవస్థలు

పట్టణంలో వేలాదిమంది సొంతిల్లు లేనివారున్నారు. అద్దె ఇళ్లలోనే సంవత్సరాలుగా కాలం గడుపుతున్నారు. గత ప్రభుత్వంలో పలుమార్లు అర్జీలిచ్చినా.. ఇళ్లు మంజూరు చేయలేదు. దీంతో కూటమి ప్రభుత్వంపై ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. అందరికీ ఇళ్లు పథకంలో తమకు తప్పకుండా మంజూరవుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అద్దెలు కట్టలేక కుటుంబ పోషణ భారంగా మారింది. సంపాదించిన దానిలో సగం అద్దెలకే సరిపోతోందని వారు వాపోతున్నారు.

14 ఏళ్లుగా అద్దె ఇంట్లోనే..



పట్టణంలోని గాంధీనగర్‌లో 14 ఏళ్లుగా అద్దె ఇంట్లో ఉంటున్నాం. పిల్లలు పెద్దవారు కావడంతో అద్దె ఇంట్లో ఇబ్బందులు పడుతున్నాం. ఏటా అద్దె పెంచుతూనే ఉన్నారు. తాగునీటితోపాటు అన్నింటికీ పరిమితులు విధిస్తారు. సొంతింటి కలను కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుందన్న ఆశాభావంతో ఉన్నాం.

\- అమ్మాజాన్, గాంధీనగర్, కదిరి

ఇల్లు ఎప్పుడిస్తారో?



పదేళ్లుగా ఆర్ఎస్ రోడ్డులో అద్దె ఇంట్లో ఉంటున్నాం. ఇంటికోసం పలుమార్లు దరఖాస్తు చేసుకున్నా.. మంజూరుకాలేదు. అద్దెలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నాం. సొంతిల్లు వస్తుందని ఎంతో ఆశపడుతున్నాం.

\- గౌరమ్మ, ఆర్ఎస్ రోడ్డు, కదిరి

విద్యార్థులను శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దండి
● ఏటీఎల్ ఇన్‌చార్జ్‌లకు డీఈఓ సూచన 6

దివ్యాంగులకు భరోసా
వందశాతం రాయితీతో త్రిచక్ర వాహనాలు
ఆన్‌లైన్‌లో దరఖాస్తులు..
ఈ నెల 30 వరకు గడువు 7

షెడ్యూల్ మేరకు మెగా పీటీఎం

● కలెక్టర్ శ్యాంప్రసాద్



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ శ్యాంప్రసాద్

పుట్టపర్తి టౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పభుత్వం నిర్ణయించిన షెడ్యూల్ మేరకు జిల్లాలో డిసెంబరు 5న మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్(మెగా పీటీఎం 3.0)ను నిర్వహించాలని కలెక్టర్ శ్యాంప్రసాద్ ఆదేశించారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలో ఈ కార్యక్రమాన్ని సమగ్ర ప్రణాళికతో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన విద్యాశాఖ అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధి, అభ్యసన ఫలితాలు, హాజరు, ప్రవర్తన వంటి అంశాలపై తల్లిదండ్రులకు స్పష్టమైన అవగాహన కల్పించేలా కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ క్రిష్టప్ప, సమగ్రశిక్ష ఏపీసీ దేవరాజు, ఆర్డీఓలు సువర్ణ, మహేష్, వీవీఎస్‌శర్మ, ఆనందకుమార్, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మండల విద్యాశాఖ అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

కలెక్టర్ సూచించిన కీలక అంశాలు

- విద్యార్థుల అభ్యాస ఫలితాలపై చర్చించేందుకు తల్లిదండ్రులను ఆహ్వానించాలి.
- హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులను పంపిణీ చేయాలి.
- అన్ని జడ్పీ, ఎంపీ, ఏపీ రెసిడెసిడెన్షియల్, కేజీబీవీ, ప్రభుత్వ, ఎంజేపీ, ఏపీ మోడల్ స్కూళ్లు, జూనియర్ కాలేజీలు మెగా పీటీఎంలో భాగస్వాములు కావాలి.
- ప్రతి విద్యార్థి పురోగతి, హాజరు, ప్రవర్తన, అభ్యాస లోపాలు తల్లిదండ్రులతో వ్యక్తిగతంగా చర్చించాలి.
- అసెస్‌మెంట్ బుక్స్, హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులు పూర్తిగా అప్‌డేట్ చేయాలి.
- ఈఎంఓలు పాఠశాలల పరిసరాల పరిశుభ్రంగా ఉంచేలా చూడాలని ఆదేశించారు.

ది(తె)గులు

● దిగుబడి సమయంలో వరికి తెగుళ్ల ఉధృతి ● దోమపోటు, ఆకుమచ్చ, అగ్గితెగులు వ్యాప్తి ● దిగుబడి తగ్గుతుందని రైతుల ఆందోళన (6లో...)

రూ.కోటి భూమికి ఎసరు

దారి పేరుతో భూకబ్జా
రాత్రికి రాత్రే చదును చేసిన రిసార్ట్ నిర్వాహకులు
నిద్రమత్తులో అధికారులు



గొర్రెల పెంపక క్షేత్రానికి చెందిన భూమిలో వేసిన రోడ్డు

రోడ్డు మాటున మాయ..!

పెనుకొండ టౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): దారి మాటున రూ.కోటి విలువచేసే భూమిని కాజేసే ప్లాన్ వేశారు. గొర్రెల పెంపక క్షేత్రానికి సంబంధించిన 44 సెంట్ల భూమిని ఓ రిసార్ట్ యాజమాన్యం కబ్జా చేసిన వ్యవహారం వెలుగులోకి వచ్చింది. పట్టణ సమీపాన మడకశిరకు వెళ్లే రహదారి పక్కనే ఓ రిసార్ట్ 8.5 ఎకరాల్లో ఉంది. పూర్వం నుంచి వంక పక్కనున్న 12 అడుగుల రోడ్డులో రాకపోకలు సాగిస్తున్నారు. వంకకు ఆనుకుని గొర్రెల పెంపక క్షేత్రానికి చెందిన 807 సర్వే నంబరులో 578 ఎకరాల భూమి ఉంది. రిసార్ట్‌కు 40 అడుగుల రోడ్డు ఏర్పాటు చేసుకోవాలన్న ఆలోచనతో గొర్రెల పెంపక క్షేత్రం భూమిలో దారివేసి రాకపోకలు సాగిస్తున్నారు. రిసార్ట్‌కు వేసిన దారి గొర్రెల పెంపక క్షేత్రానికి చెందినదని పలుమార్లు రిసార్ట్ యజమానులను అధికారులు హెచ్చరించారు. తాము ఈ భూమిని కొనుగోలు చేశామంటూ వారు ఎదురు సమాధానం ఇవ్వడంతో గొర్రెల పెంపక క్షేత్రం సిబ్బంది మిన్నకుండిపోయారు. తీరా రెవెన్యూ అధికారులు ప్రశ్నించడంతో రిసార్ట్‌కు వేసిన దారి కబ్జా గుట్టురట్టయింది. ఇప్పటికైనా గొర్రెల పెంపక క్షేత్రం భూమిని కాపాడాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.



చెట్ల మధ్యలో ఏర్పాటు చేసుకున్న దారి

రాత్రికి రాత్రే చదును

ప్రభుత్వ భూమి కొనుగోలు చేయాలంటే నిబంధనల ప్రకారం రెవెన్యూ, నగర పంచాయతీ అధికారులు తీర్మానం చేయాలి. అనంతరం మార్కెట్ విలువ చెల్లించి కొనుగోలు చేయాలి. 2023లో కౌన్సిల్ తీర్మానం మేరకు 806 సర్వే నంబరులో 44 సెంట్లను కొనుగోలు చేసి దారి వేసుకోవాలని భావించారు. అందుకు మార్కెట్ విలువ ప్రకారం ఎకరా రూ.19.96 లక్షలు చెల్లించాలని తీర్మానించారు. డబ్బు చెల్లించకుండా రాత్రికిరాత్రే ప్రైవేటు మార్కెట్ విలువ ప్రకారం రూ.కోటి విలువచేసే 44సెంట్ల భూమిలో రహదారి ఏర్పాటు చేశారు. అదికూడా 806 సర్వే నంబరులో కాకుండా గొర్రెల పెంపక క్షేత్రానికి చెందిన 807 సర్వేనంబరు భూమిలో ఏర్పాటు చేసుకున్నారు. చుట్టుపక్కల ఎకరం భూమి దాదాపు రూ.2.5 కోట్లు పలుకుతోంది. ఆ లెక్కన 44 సెంట్ల భూమి రూ.కోటికిపైగానే విలువ చేస్తుంది.

పట్టించుకోని అధికారులు

మడకశిరకు వెళ్లే రహదారిలో అది కూడా గొర్రెల పెంపక క్షేత్రం కార్యాలయ సమీపంలో రూ.కోటి విలువచేసే భూమి కబ్జా అవుతున్నా.. అడ్డుకోవాల్సిన అధికారులు పట్టించుకోవట్లేదు. వారి తీరుపై ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా గొర్రెల పెంపక క్షేత్రం భూమి స్వాధీనం చేసుకుంటారా, ఇలాగే నిద్రమత్తులో ఉంటారా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

భూమిని స్వాధీనం చేసుకుంటాం



గొర్రెల పెంపక క్షేత్రానికి సంబంధించిన భూముల్లో రిసార్ట్‌కు దారి వేసుకున్నారు. దానిని తొలగించి, హద్దులు వేసుకుంటాం. రెవెన్యూ అధికారులకు రికార్డులు చూపించాం. రిసార్ట్ నిర్వాహకులు 806 సర్వేనంబరులో కొనుగోలు చేసి, అందులో వేసుకోవాల్సిందిపోయి తమకు చెందిన 807 సర్వేనంబరులో దాదాపు 40సెంట్లు ఆక్రమించుకున్నారు. తొలగించుకునేందుకు గడువు కోరారు. గడువులోగా తొలగించకపోతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, చర్యలు తీసుకుంటాం. రాత్రికి రాత్రే మట్టి తరలించి, రోడ్డు వేసుకున్నారు.

\- కాంతమ్మ, డీడీ, గొర్రెల పెంపక క్షేత్రం

5న భూతప్పల ఉత్సవం

● రేపట్నుంచి భక్తరహళ్ళి బ్రహ్మోత్సవాలు



భక్తరహళ్ళి నరసింహస్వామి



జిల్లేడగుంట ఆంజనేయస్వామి

మడకశిర రూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రసిద్ధ భక్తరహళ్ళి నరసింహస్వామి, జిల్లేడగుంట ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాల్లో కీలకమైన భూతప్పల ఉత్సవం డిసెంబరు 5వ తేదీన నిర్వహించనున్నట్లు ఈఓ నరసింహరాజు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈనెల30న బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 30న విశ్వక్సేన, రక్షాబంధన, అంకురార్పణ, 1న ధ్వజారోహణ, అగ్నిహోత్ర హోమం, 2న శ్రీమన్యు సూక్త హోమం, 3న లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం, 4న స్వామివారి బ్రహ్మరథోత్సవం, 5న జ్యోతుల పరుష, భూతప్పల ఉత్సవం, 6న తలనీలాలు, పూలపల్లకి ఉత్సవం, 7న కంబాల నరసింహస్వామి జ్యోతుల పరుష, 8న చక్రస్నానం, వసంతోత్సవంతో స్వామి వారి బ్రహ్మోత్సవాలు ముగియనున్నట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా క్యూలైన్లతోపాటు అన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

పుట్టింటికి వచ్చినట్లుంది..

● పురం పర్యటనపై నారా బ్రాహ్మణి ● పలు విద్యాసంస్థల సందర్శన

హిందూపురం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): హిందూపురం రావడంతో పుట్టింటికి వచ్చినట్లుందని ఐటీ, విద్యాశాఖామంత్రి నారా లోకేశ్ సతీమణి, హెరిటేజ్ సంస్థల ఈడీ నారా బ్రాహ్మణి అన్నారు. నియోజకవర్గంలోని చిలమత్తూరు, లేపాక్షి, హిందూపురం మండలాల్లో శుక్రవారం ఆమె పర్యటించారు. చిలమత్తూరు జూనియర్ కళాశాల, లేపాక్షి మండలం కుర్లపల్లి, హిందూపురం మండలం పూలకుంట ప్రభుత్వ పాఠశాలకు కంప్యూటర్లు, ప్రింటర్లు అదించారు. లేపాక్షి నవోదయలో సోలార్ గీజర్లను పరిశీలించారు. వీటిని హెరిటేజ్ సంస్థ ఆధ్వర్యంలో అందించినట్లు తెలిపారు. హిందూపురం అంటే నందమూరిపురమనీ, ఇక్కడి నుంచి తమ తాత నందమూరి తారకరామారావు, పెదనాన్న హరిక్రిష్ణ, తండ్రి నందమూరి బాలకృష్ణ ప్రాతినిధ్యం వహించారన్నారు. ఈ లెక్కన నందమూరి కుటుంబానికి నియోజకవర్గంతో ఎంత బలమైన బంధం ఉందో అర్థం అవుతుందన్నారు. భవిష్యత్తులో కూడా చదువుకు హెరిటేజ్ సంస్థ సహాయసహకారాలు అందిస్తుందన్నారు. విద్యార్థులు విలువలతో కూడిన విద్యను నేర్చుకుని సమాజానికి ఉపయోగపడేలా ఎదగాలన్నారు. చిలమత్తూరు, లేపాక్షి, హిందూపురం పాఠశాలల్లో నారా బ్రాహ్మణికి పుష్పగుచ్చాలు ఇచ్చి, ఘనంగా స్వాగతించారు. ఆమెపై విద్యార్థులు పూలు చల్లుతూ పాఠశాలలోకి ఆహ్వానించారు. పాఠశాల గదులు, లైబ్రరీలను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో టీడీపీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, పూలకుంట సర్పంచ్ మంజునాథ్, ఎమ్మెల్యే పీఏ బాలాజీ, నాయకులు రామకృష్ణారెడ్డి, గంగాధర్, శ్రీనివాసులు, చంద్రప్ప పాల్గొన్నారు.



పూలకుంట పాఠశాలలో మాట్లాడుతున్న నారా బ్రాహ్మణి

పోలీసులకు క్రమశిక్షణ ముఖ్యం: ఎస్పీ



పోలీసు పరేడ్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

పుట్టపర్తిరూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పోలీసుశాఖలో క్రమశిక్షణ అత్యవసరమని, అందుకు తగ్గట్టు ప్రతిఒక్కరూ ప్రతిరోజు వ్యాయామం, ధ్యానం చేసేవిధంగా కార్యాచరణ రూపొందించుకోవాలని ఎస్పీ సతీష్‌కుమార్ తమ సిబ్బందికి సూచించారు. జిల్లాకేంద్రంలోని పోలీసుపరేడ్ మైదానంలో సాయిధ బలగాలు, స్పెషల్‌పార్టీ పోలీసులు, హోంగార్డు సిబ్బందితో శుక్రవారం నిర్వహించిన పరేడ్‌ను ఎస్పీ పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసుశాఖలో పరేడ్ అనేది క్రమశిక్షణకు నిదర్శనమని, ప్రతిఒక్కరూ క్రమశిక్షణతో మెలుగుతూ విధులు నిర్వర్తించాలన్నారు. పరేడ్ కార్యక్రమం సిబ్బంది అందరిని సమైక్యం చేస్తుందన్నారు. ఎస్కార్ట్ సిబ్బంది నిందితులతో జత కట్టకుండా నిబద్ధతతో విధులు నిర్వహించాలన్నారు. జిల్లా పోలీసులు అందరూ ఆరోగ్యంపట్ల పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సిబ్బందికి ఏ కష్టం వచ్చినా, విధుల్లో ఇతర విషయాల్లో ఎలాంటి సమస్యలున్నా నేరుగా తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఆర్ఐలు రవికుమార్, వలి, మహేష్, ఆర్ఎస్సైలు వీరన్న, ప్రదీప్‌సింగ్, ప్రసాద్, ఇతర ఏఆర్ సిబ్బంది హోంగార్డులు స్పెషల్‌పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

దశాబ్దాల కల నెరవేర్చిన ఘనత చంద్రబాబుదే..

రెవెన్యూ డివిజన్ ఏర్పాటుపై ఎమ్మెల్యే ఎంఎస్ రాజు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిరటౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మడకశిర నియోజకవర్గంలో రెవెన్యూ డివిజన్ ఏర్పాటు దశాబ్దాల కల అనీ, దానిని నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అన్నారు. స్థానిక తన క్యాంపు కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామితో కలిసి ఎమ్మెల్యే మాట్లాడారు. మడకశిర రెవెన్యూ డివిజన్ ఏర్పాటు ద్వారా ఏళ్లుగా ఉన్న భూసమస్యల పరిష్కారానికి మార్గం లభించినట్లే అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు గతేడాది ఆగస్టు 1వ తేదీన మడకశిరకు వచ్చినపుడు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని కోరగా.. సానుకూలంగా స్పందించారన్నారు. ఆ హామీని నెరవేర్చడంతో సంతోషంగా ఉందన్నారు. రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు సహకరించిన సహకరించిన ముఖ్యమంత్రి చంద్రబాబుతోపాటు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌కు ధన్యవాదాలు తెలిపారు.

చౌక బేరం..!

- తక్కువ ధరకు సిమెంట్ విక్రయాలు
- ట్యాంకర్ల డ్రైవర్లతో కొందరు లాలూచీ
- జోరుగా లూజ్ సిమెంట్ అమ్మకాలు
- నష్టపోతున్నామంటున్న డీలర్లు



ట్యాంకర్ నుంచి సిమెంట్ దించుతున్న దృశ్యం

కదిరి అర్బన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని కదిరి కుంట్లపల్లి వద్ద సిమెంట్ అక్రమ అమ్మకాలతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని పట్టణంలోని డీలర్లు గగ్గోలు పెడుతున్నారు. ఇక్కడ సిమెంట్‌ను తక్కువ ధరకే ఇస్తుండటంతో అనేకమంది ఇక్కడే కొనడానికి మొగ్గు చూపుతున్నారు. దీంతో లైసెన్స్ కలిగిన దుకాణదారులు గిరాకీలేక నష్టపోతున్నారు.

జోరుగా లూజ్ సిమెంట్ విక్రయాలు

సిమెంట్ ఎక్కువగా కడప జిల్లా యర్రగుంట్ల నుంచి వివిధ రాష్ట్రాలకు రవాణా చేస్తున్నారు. ఈ క్రమంలో ఎర్రగుంట్ల నుంచి ప్రతిరోజు వందల సంఖ్యలో సిమెంట్ ట్యాంకర్లు కదిరి మీదుగా బెంగళూరుకు వెళుతున్నాయి. ఈ ట్యాంకర్లలోని సిమెంట్‌ను కొంతమంది డ్రైవర్లు అక్కడక్కడ వాహనాలను ఆపి విక్రయిస్తున్నారు. ట్యాంకర్లలోని సిమెంట్‌ను సంచులకు నింపి మార్కెట్ ధర కంటే వంద రూపాయల వరకు తగ్గించి అమ్ముతున్నారు. దీంతో ఈ లూజ్ సిమెంట్‌కు మంచి గిరాకీ ఏర్పడింది. మండలంలోని పులివెందుల రోడ్డు కదిరి కుంట్లపల్లి, సోమేష్‌నగర్ వద్ద ఈ లూజ్ సిమెంట్ వ్యాపారం జోరుగా సాగుతోంది. ఓ ట్యాంకర్ నుంచి 50 నుంచి 60 బస్తాల వరకు సిమెంట్ తీసి ఖాళీ సంచుల్లో నింపి అప్పటికప్పుడే తక్కువ ధరకు విక్రయిస్తున్నారు. కొందరు వ్యాపారులు కదిరిలో నిర్మాణదారుల ఇంటి వద్దకే ఈ లూజ్ సిమెంట్‌ను చేరుస్తుండటం కొసమెరుపు.

అటువైపు చూడని పోలీసులు

ఇంత జరుగుతున్న పోలీసులు అటువైపు కన్నెత్తి చూడలేదన్న విమర్శలున్నాయి. లూజ్ సిమెంట్ అమ్మకాలపై చర్యలు తీసుకోవాలని పోలీసుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని కొందరు వ్యాపారులు వాపోతున్నారు. మొదట్లో ఒకరు, ఇద్దరు ఈ లూజ్ సిమెంటు విక్రయాలు చేస్తుండగా ఇప్పుడు అక్రమ సంపాదనకు అలవాటు పడి పదుల సంఖ్యలో ఈ వ్యాపారం మొదలుపెట్టారు. ఇటీవల సిమెంట్ దించుకొనే సమయంలో వ్యాపారుల మధ్య ఘర్షణ కూడా జరిగింది.

నష్టపోతున్నాం: ఆనందరెడ్డి, సిమెంట్ డీలర్

లూజ్ సిమెంట్ విక్రయాల వల్ల తీవ్రంగా నష్టపోతున్నాం. వేలాది రూపాయలు టాక్స్‌లు చెల్లించి వ్యాపారం చేయడం కష్టంగా మారింది. తక్కువ ధరకే దొరుకుతుండటంతో వినియోగదారులు ఆ సిమెంట్ కొనడానికే మొగ్గు చూపుతున్నారు. వీటిపై పోలీసులు దృష్టి సారించి కట్టడి చేయాలి. లేక పోతే మా దుకాణాలు మూసుకోవాల్సిందే.

విచారించి.. చర్యలు తీసుకుంటాం



తక్కువ ధరలకే లూజ్ సిమెంట్ విక్రయిస్తున్నవారిపై దృష్టి సారిస్తాం. రహదారి పక్కన జరుగుతున్న ఈ అక్రమ వ్యాపారంపై నిఘా ఉంచి బాధ్యులపై చర్యలు తీసుకొంటాం.

\-నిరంజన్ రెడ్డి, సీఐ, అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్, కదిరి

ఇప్పటికే చేసేశారు..!

ఇంటి దరఖాస్తులకు ఆన్‌లైన్ ఎర్రర్ 7

శీతా.. చంపేయకే..!

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి, అనంతపురం



ఆకాశానికి.. అవనికి ఒకటే వణుకు..!
కంబళిని చుట్టుకున్నా నిద్ర లేదు..!
సూరీడి కోసం చీకటి కన్నుల ఎదురుచూపు..!



ఎంత కాచుకున్నా వేడి లేదు..
నిజమే.. ఇది 'చలి' మంట..!



అనంతపురం నగరంలో చలి తీవ్రత పెరుగుతోంది. సూరీడి కిరణాలు భూమిని తాకేందుకు తంటాలు పడేలా పొగ మంచు కమ్మేస్తోంది. సాయంత్రం మొదలైన వణుకు.. రేయి దాటుకుని.. ఉదయం 8 గంటలు దాటినా తగ్గడం లేదు. చలి మంటలు, దుప్పట్లు కాస్త ఉపశమనం కలిగిస్తున్నాయి.

దేవుడు.. జీవుడు..
పూజకు పూలు
పూటకు తిండి..!



రాత్రంతా
కునుకు లేదు..!
తెల్లవారినా
వణుకు తగ్గలేదు..!



పొద్దెక్కేదాకా
లేచే కథే లేదు..!



నేను రానేరానన్నా..
అమ్మ వింటే కదా..!

జెండర్ క్యాంపెయిన్ పక్కాగా నిర్వహించాలి: కలెక్టర్

- కలెక్టర్ ఆనంద్



జెండర్ క్యాంపెయిన్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఆనంద్

అనంతపురం అర్బన్, నవంబరు28(ఆంధ్రజ్యోతి): జెండర్ క్యాంపెయిన్‌ను పక్కాగా నిర్వహించాలని డీఆర్‌డీఏ, అనుబంధ శాఖల అధికారులు, మహిళాసంఘాల సభ్యులకు కలెక్టర్ ఆనంద్ సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన డీఆర్‌డీఏ పీడీ శైలజ, ఏపీడీ రాధారాణిలతో కలిసి జెండర్ క్యాంపెయిన్‌కు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ జెండర్ క్యాంపెయిన్‌లో భాగంగా డిసెంబరు 23 దాకా స్వయం సహాయక సంఘాలు, గ్రామైక్య సంఘాలు, మండల సమాఖ్యలు, జిల్లా సమాఖ్యల సభ్యులు ప్రత్యేక ర్యాలీలు, సమావేశాలు, అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. మహిళాచట్టాలు, బాలిక విద్య, మహిళలు - పురుషులు సమానత్వం, బాల్యవివాహాల నివారణ తదితర అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీపీఎం రవీంద్రబాబు, ఏపీఎంలు భాస్కర్‌నాయుడు, శివప్రసాద్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు సుశీలమ్మ, సభ్యులు పాల్గొన్నారు.

అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు వరం

- ఆవిష్కరణల వైపు విద్యార్థులను ప్రోత్సహించండి
- సైన్స్ టీచర్లకు డీఈఓ, ఏపీసీ సూచన



సైన్స్ ప్రాజెక్టులను పరిశీలిస్తున్న డీఈఓ, ఏపీసీ

అనంతపురం విద్య, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు ప్రభుత్వ పాఠశాలలకు రావడం వరమని డీఈఓ ప్రసాద్ బాబు పేర్కొన్నారు. అటల్ టింకరింగ్ ల్యాబ్‌ల నిర్వహణపై సైన్స్‌టీచర్లకు జిల్లా సైన్స్ సెంటర్‌లో మూడు రోజులుగా శిక్షణ ఇస్తున్నారు. చివరిరోజు శుక్రవారం టీచర్లు తయారు చేసిన ప్రాజెక్టులను ప్రదర్శించారు. డీఈఓ ప్రసాద్‌బాబు, సమగ్రశిక్ష ఏపీసీ శైలజ వాటిని పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. జిల్లాలోని 45 పీఎంశ్రీ స్కూళ్లలో అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు ఏర్పాటు చేశారన్నారు. ఇందుకోసం లక్షలు వెచ్చించి ల్యాబ్ భవనం, సైన్స్ పరికరాలు అందిస్తున్నారన్నారు. అలాంటి ల్యాబ్‌లను సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత హెచ్‌ఎం, టీచర్లపై ఉందన్నారు. ల్యాబ్‌ల ద్వారా విద్యార్థుల్లో పరిజ్ఞానం పెంచుతూ పరిశోధనల వైపు ఆలోచించేలా తీర్చిదిద్దాలని సూచించారు. కార్యక్రమంలో సైన్స్ ఆఫీసర్ బాలమురళి, సీఎంఓ చంద్రశేఖర్, ఏపీఓ మంజునాథ్ పాల్గొన్నారు.

పరిశ్రమల ఏర్పాటుకు సత్వర చర్యలు : కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు సత్వర చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం 64వ జిల్లా పరిశ్రమలు, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ(డిస్ట్రిక్ ఇండస్ట్రీస్, ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కమిటీ) సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పెట్టుబడులు పెట్టడానికి వచ్చే పారిశ్రామికవేత్తలను అన్ని రకాలుగా ఆయా శాఖల అధికారులు ప్రోత్సహించి పరిశ్రమల ఏర్పాటుకు సత్వర చర్యలు తీసుకోవాలన్నారు.



అధికారులతో సమావేశమైన కలెక్టర్

అరటి ధర తగ్గకుండా చూడాలి

జిల్లాలోని అరటి వ్యాపారులు, ఎగుమతిదారులు, ఉద్యానశాఖ అధికారులతో ధర నియంత్రణపై కలెక్టరేట్‌లో శుక్రవారం సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ... అరటి కిలోకు రూ.6లకు తగ్గకుండా రైతుల నుంచి కొనుగోలు చేయాలని, ఎగుమతి దారులు ఇతర దేశాల మార్కెట్‌కు కిలో రూ.8లకు తగ్గకుండా కొనుగోలు చేసి ఎగుమతి చేయాలని సూచించారు.

5న మెగా పీటీఎం

జిల్లా వ్యాప్తంగా డిసెంబరు 5న మెగా పీటీఎం(పేరెంట్స్ టీచర్స్‌మీటింగ్) 3.0 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని కలెక్టర్ ఆనంద్ తెలిపారు. 1 నుంచి ఇంటర్ వరకు అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, సంస్థల్లో మోడల్ స్కూళ్లలో, కేజీబీవీ, ట్రైబల్ వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్ సంస్థల్లో పీటీఎం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తామన్నారు. మొత్తం 1752 పాఠశాలలు, కళాశాలల్లో పీటీఎం నిర్వహిస్తుండగా, మొత్తం 2,15,504 మంది విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొంటారన్నారు.

జర్నలిస్టుల అక్రెడిటేషన్ కార్డుల గడువు

జర్నలిస్టుల అక్రెడిటేషన్ కార్డుల గడువును మరో రెండు నెలలు పొడిగించినట్లు కలెక్టర్ ప్రకటనలో తెలిపారు. డిసెంబరు 1 నుంచి 2026 జనవరి 31 వరకు లేదా నూతన అక్రెడిటేషన్‌లు జారీ ప్రక్రియ పూర్తి అయ్యే వరకు ఏది ముందు జరిగితే అప్పటిరకు పొడిగింపు ఉంటుందని ఉత్తర్వులు జారీ చేసినట్లు పౌర సంబంధాల శాఖ సంచాలకులు కేఎస్ విశ్వనాథన్ తెలిపారు.

ప్రతి చిన్నారి ఆరోగ్యవంతంగా ఉండాలి

అనంతపురం వైద్యం: అంగన్‌వాడీ కేంద్రాలద్వారా పౌష్టికాహారాన్ని తీసుకునే ప్రతి చిన్నారి ఆరోగ్యంగా ఉండాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఐసీడీఎస్ అధికారులతో జరిగిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ పీఎంఎంవీవై ద్వారా అందజేస్తున్న పౌష్టికాహారం సక్రమంగా అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు పంపిణీ చేయాలన్నారు. 37 అంగన్‌వాడీ కార్యకర్తలు, 81 సహాయకుల పోస్టులతో పాటు ఇతర విభాగాల్లోని పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

వందశాతం ఆభా రిజిస్ట్రేషన్ జరగాలి

ఆభా(ఆయుష్మాన్ భారత్) రిజిస్ట్రేషన్ వందశాతం జరిగేలా చూడాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వైద్య, ఆరోగ్యశాఖపై శుక్రవారం సమీక్షించిన కలెక్టర్ గర్భవతులు, ప్రసవాలు, సిజేరియన్, జననాలు, రక్తహీనత వంటి అంశాలపై అధికారులతో మాట్లాడారు. అర్హులైన లబ్ధిదారులందరికీ జననీ సురక్ష యోజన ఆర్థిక సాయం అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఉత్తమ మహిళా టీచర్ ఆచార్య శేష మహేశ్వరమ్మ




శేష మహేశ్వరమ్మ

అనంతపురం రూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): 'ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ - షయోస్టా ఆక్తర్ మెమోరియల్ నేషనల్ అవార్డు ఫర్ ఇంజనీరింగ్ కాలేజెస్' ఉత్తమ మహిళా టీచర్-2025కు జేఎన్‌టీయూఏ పులివెందుల ఇంజనీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య శేషమహేశ్వరమ్మ ఎంపికయ్యారు. ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ 55వ జాతీయ వార్షిక అధ్యాపక సదస్సును పురస్కరించుకుని అవార్డులను ప్రదానం చేస్తున్నారు. పుదుచ్చేరిలోని శ్రీ మనకుల వినాయకర్ ఇంజనీరింగ్ కళాశాలలో జరగున్న సదస్సులో అవార్డును అందజేస్తారు. తనకు అవార్డు దక్కడం సంతోషంగా ఉందని ఆచార్య శేష మహేశ్వరమ్మ అన్నారు. వృత్తి ప్రయాణంలో గొప్ప గౌరవం దక్కిందని అన్నారు. తనకు ఎప్పటికప్పుడు అండగా నిలచిన విశ్వవిద్యాలయ పరిపాలకులు, గురువులకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు. అందరి సహకారం, ప్రోత్సాహంతో అవార్డు దక్కిందని అన్నారు. ఆమెను వర్సిటీ వైస్ చాన్సలర్ సుదర్శనరావు, రిజిస్ట్రార్ కృష్ణయ్య, ఓఎస్‌డీ టు వీసీ ఆచార్య దేవన్న అభినందించారు.

గురువులకు ఆటల పోటీలు

అనంతపురం విద్య, నవంబరు28 (ఆంధ్రజ్యోతి): మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు టీచర్లకు ఆటల పోటీలు నిర్వహించాలని విద్యాశాఖ కమిషనర్ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. పురుషులకు క్రికెట్, మహిళకు త్రోబాల్ పోటీలు నిర్వహించనున్నారు. డీఈఓ ప్రసాద్‌బాబు క్రీడాపోటీల షెడ్యూల్‌ను శుక్రవారం ప్రకటించారు. ఈనెల 29, 30న మండలస్థాయిలో పోటీలు జరగనున్నాయి. డిసెంబరు 13, 14న డివిజన్ స్థాయిలోను, డిసెంబరు 20 నుంచి 22 వరకు జిల్లా స్థాయిలో, వచ్చే ఏడాది జనవరి 2నుంచి 4వరకు రాష్ట్రస్థాయిలో క్రీడాపోటీలు నిర్వహిస్తామని డీఈఓ తెలిపారు.

టమోటా కిలో రూ.37



అనంతపురంరూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్లో శుక్రవారం టమోటాలు కిలో గరిష్ఠంగా రూ.37తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. కనిష్ఠంగా రూ.14తో, సరసరిగా రూ.24తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 2025 టన్నుల టమోటాలు వచ్చాయన్నారు.

స్వామి దిందక తోంతోం..!

ఘనంగా అయ్యప్ప విగ్రహ పునఃప్రతిష్ఠ వేడుకలు




పూజలు అందుకున్న అయ్యప్పస్వామి, గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు



అనంతపురం నగరంలో అయ్యప్ప స్వామి గ్రామోత్సవం కన్నుల పండువగా సాగింది. రామ్‌నగర్ 80 అడుగుల రోడ్డులోని అయ్యప్ప స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న పునఃప్రతిష్ఠ వేడుకల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం భక్తులు గ్రామోత్సవాన్ని నిర్వహించారు. భాస్కర తారానాథశర్మ నేతృత్వంలో ఆలయ ఆవరణలో అర్చక బృందం కలశార్చనలు, సాయందీక్షా హోమం, వేదపారాయణ జపాలు నిర్వహించారు. పునఃప్రతిష్ఠించనున్న విగ్రహాలతోపాటు స్వర్ణకవచ సహిత అయ్యప్పస్వామి విగ్రహాలకు ధాన్యాధివాసం, సుగంధ ద్రవ్యాధివాసం చేశారు. ఆలయ శిఖర కలశానికి వేద పండితులు, ఆలయ పాలక మండలి సభ్యులు అభిషేకం చేశారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో స్వామివారి ఉత్సవమూర్తిని నగర వీధుల్లో గుండా ఊరేగించారు. వందలాది మంది అయ్యప్ప మాలధారులు స్వామివారి శరణుఘోషతో ముందుకు సాగారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు హరినాథరెడ్డి, ఉపాధ్యక్షులు నెట్టెం సూర్యనారాయణ, కేవీ నారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎల్‌ఐసీ సూర్యనారాయణ, కార్యదర్శి సివిల్ సప్లయ్స్ శ్రీనివాసులు, వెంకటనారాయణ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం టౌన్

ది(తె)గులు



- దిగుబడి సమయంలో వరికి తెగుళ్ల ఉధృతి
- ప్రబలిన దోమపోటు, ఆకుమచ్చ, అగ్గితెగులు
- దిగుబడి తగ్గుతుందని రైతుల ఆందోళన



తెగుళ్ల బారిన పడిన వరి

ధర్మవరం రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో సాగుచేసిన వరికి దోమపోటు, ఆకుమచ్చ, అగ్గితెగుళ్ల పట్టుకున్నాయి. వాతావరణ మార్పులతో తెగుళ్ల ఉధృతి ఎక్కువగా ఉంది. మండలవ్యాప్తంగా ఖరీఫ్‌లో 2వేలఎకరాల్లో బోరుబావులు, చెరువుల కింద వరి సాగు చేసినట్లు మండల వ్యవసాయాధికారులు చెబుతున్నారు. నీరు పుష్కలంగా ఉండటంతో ఈ ఏడాది వరిసాగు విస్తీర్ణం పెరిగింది. పంట సాగుచేసి నాలుగు నెలలు కావస్తోంది. ప్రస్తుతం పంటకు విపరీతంగా తెగుళ్లు వ్యాపించాయి. తెగుళ్ల నివారణ కోసం రైతులు పురుగు మందుల దుకాణాలకు పరుగులు తీస్తున్నారు. గింజలు ఏర్పడే దశలో ఈ తెగుళ్లు వ్యాపించడంతో దిగుబడి బాగా తగ్గుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. చిన్నూరుబత్తలపల్లి, మల్కాపురం, చింతలపల్లి, పోతుకుంట, చిగిచెర్ల, వసంతపురం, కుణుతూరు, బడన్నపల్లి, తుమ్మల, తిప్పేపల్లి తదితర గ్రామాల రైతులు అధికంగా వరి సాగు చేశారు. దిగుబడి సమయంలో తెగుళ్లు ఉధృతి ఎక్కువగా ఉండటంతో వేలాది రూపాయలు వెచ్చించి పురుగు మందులు పిచికారీ చేస్తున్నారు. అయినా తెగుళ్ల ఉధృతి తగ్గక పోవడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయాధికారులు పంటలను పరిశీలించి, తెగుళ్ల నివారణకు తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

దోమపోటుకు మందులు పిచికారీ చేశా



వరి పంటలో అధికంగా దోమపోటు, అగ్గితెగులు సోకింది. దిగుబడి సమయంలో తెగుళ్లు వ్యాపించడంతో ఆందోళనగా ఉంది. నివారణకు మందులు పిచికారీ చేశా. వాతావరణంలో మార్పులతో తెగుళ్ల వ్యాప్తి అధికంగా ఉంది. గింజలు ఏర్పడే సమయంలో తెగుళ్లు రావడంతో ఆ గింజలు తాలుగా మారే అవకాశం ఉంది.

- భాస్కర్ చౌదరి, సాగురైతు, చిన్నూరు, బత్తలపల్లి, ధర్మవరం మండలం

మందులు పిచికారీ చేసుకోవాలి



వాతావరణ మార్పులతో ప్రస్తుతం వరికి దోమపోటు సోకే అవకాశం ఎక్కువగా ఉంటుంది. సకాలంలో మందులు పిచికారీ చేసుకోవాలి. వరిలో దోమపోటు నివారణకు పైమెట్రజోల్ 50శాతం అనే ద్రావణాన్ని ఎకరాకు 120గ్రాములు 200లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. అగ్గితెగుళ్ల నివారణ ట్రైసైక్లోజోల్, ఆకుమచ్చ తెగుళ్లకు సాఫ్ కార్బన్డజిమ్12 శాతం, మ్యాన్కోజెబ్ 63శాతాన్ని ఎకరాకు 400గ్రాముల చొప్పున పిచికారీ చేయాలి. తెగుళ్లను సకాలంలో నివారిస్తే దిగుబడి బాగా వచ్చే అవకాశం ఉంటుంది.

- ముస్తఫా, ఏఓ, ధర్మవరం

విద్యార్థులను శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దండి

- ఏటీఎల్ ఇన్‌చార్జ్‌లకు డీఈఓ సూచన

కొత్తచెరువు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో నూతన అవిష్కరణలు చేసి, తద్వారా విద్యార్థులను శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలని డీఈఓ క్రిష్టప్ప పేర్కొన్నారు. మూడు రోజులుగా స్థానిక బాలుర ఉన్నతపాఠశాలలో జిల్లా సైన్స్ అధికారి తనూజ్‌కుమార్ ఆధ్వర్యంలో అటల్ టింకరింగ్ ల్యాబ్(ఏటీఎల్) ఇన్‌చార్జ్ టీచర్లకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. కార్యక్రమానికి డీఈఓ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఉపాధ్యాయులు తమ బోధనల ద్వారా విద్యార్థుల్లో జిజ్ఞాసను రేకెత్తించి, వారు ఆవిష్కరణల వైపు మొగ్గు చూపేలా చర్యలు తీసుకోవాలన్నారు. నీతిఆయోగ్, అటల్ ఇన్నోవేషన్ మిషన్, సమగ్రశిక్ష, యూనిసెఫ్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిక్షణ తరగతులను నిర్వహించినట్లు జిల్లా సైన్స్‌అధికారి తనూజ్ కుమార్ తెలిపారు. ఈ శిక్షణ తరగతులకు జిల్లాలో 12 పాఠశాలకు చెందిన ఏటీఎల్ ఇన్‌చార్జ్‌లు 8 ప్రదర్శనలు రూపొందించారన్నారు. ఈ ఆవిష్కరణలు సమాజానికి ఎంతో ఉపయోగపడే రీతిలో ఉన్నాయని అభినందించారు. కార్యక్రమంలో ఏడీ-2 లాజర్, బాలుర ఉన్నతపాఠశాల హెచ్‌ఎం గోపాల్, ఎంఈఓ-2 జయచంద్ర, రమేశ్, అనిల్ పాల్గొన్నారు.



ప్రాజెక్టులను పరిశీలిస్తున్న డీఈఓ

సమన్వయంతోనే సక్సెస్: డీఆర్ఎం



మాట్లాడుతున్న డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా

గుంతకల్లు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్టేషన్ మేనేజర్లు, స్టేషన్ మాస్టర్లు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు సమన్వయంతో పనిచేసి రైల్వేలో భద్రత, సమయ పాలన లక్ష్యాలను సాధించాలని డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా పేర్కొన్నారు. రైల్వే డివిజనల్ కేంద్రంలోని మల్టీ డిసిప్లినరీ డివిజనల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో స్టేషన్ మేనేజర్లు, స్టేషన్ మాస్టర్లు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ల భాగస్వామ్యంలో భద్రతా సదస్సును శుక్రవారం ఉదయం నిర్వహించారు. సమావేశంలో డీఆర్ఎం మాట్లాడుతూ స్టేషన్ మేనేజర్లు, స్టేషన్ మాస్టర్లు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు తమ పరిధిలో సమయానుగుణంగా తనిఖీలను నిర్వహించాలన్నారు. విధి నిర్వహణలో షార్ట్‌కట్స్‌ను అనుసరించరాదని సూచించారు. కలిసికట్టుగా సమన్వయంతో పనిచేసినప్పుడే సత్ఫలితాలు లభిస్తాయన్నారు. విధి నిర్వహణలో చొరవచూపిన అధికారులను ప్రశంసించారు.

రైలు దారి మళ్లింపు

గుంతకల్లు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉత్తర మధ్య రైల్వేలోని వీరాంగన లక్ష్మీబాయి రైల్వే స్టేషన్‌లోని మూడో నంబరు ప్లాట్‌ఫాంలో జరుగుతున్న అభివృద్ధి పనుల కారణంగా గుంతకల్లు మీదుగా వెళ్లే ఓ రైలును దారి మళ్లించనున్నట్లు రైల్వే అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఢిల్లీ సరాయ్ రోహిల్లా-యశ్వంతపూర్ వీక్లీ దురంతో (12214) ఎక్స్‌ప్రెస్‌ను డిసెంబరు 1వ నుంచి జనవరి 5 వరకూ దారి మళ్లించి నడపనున్నట్లు తెలిపారు. ఈ రైలును పేర్కొన్న తేదీల మధ్య మధుర, బయాన, సోగరియా, రుథియాయి, బీనా స్టేషన్ల మీదుగా దారి మళ్లించనున్నట్లు వివరించారు.


రైల్వే ఉద్యోగి భార్య ఆత్మహత్య

గుత్తి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): గుత్తిఆర్ఎస్ రైల్వే ఇనిస్టిట్యూట్ సమీపంలో ఉన్న రైల్వే క్వార్టర్స్‌లో నివసిస్తున్న రైల్వే ఉద్యోగి భార్య జ్యోతి(23) శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన రాహుల్ కుమార్ స్థానిక రైల్వేలో లోకో పైలెట్‌గా పని చేస్తున్నాడు. ఆయన డ్యూటీకి వెళ్లగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో జ్యోతి ఈ అఘాయిత్యానికి పాల్పడిందన్నారు. వీరికి వివాహమై మూడేళ్లయినా సంతానం కలగలేదని బాధ ఉండేదని సమాచారం. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

నీటిలో ఈదలేక గేదె మృతి

రైల్వే అండర్ బ్రిడ్జిలో 15 అడుగుల మేర నీటి నిల్వ

పొలాలకు వెళ్లేందుకు తుమ్మల గ్రామ రైతుల ఇబ్బందులు



గేదె కళేబరం

ధర్మవరంరూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రైల్వే అండర్ బ్రిడ్జి నీటిలో ఈదలేక ఓ గేదె మృత్యువాత పడిన సంఘటన మండలంలోని తుమ్మల గ్రామసమీపంలో జరిగింది. ఇక్కడ 15అడుగుల మేర నీళ్లు నిలబడటంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. తుమ్మల గ్రామ రైతులకు బ్రిడ్జి అవతల సుమారు 100ఎకరాల పొలాలు ఉన్నాయి. ప్రతిరోజు అండర్‌బ్రిడ్జిని దాటుకొని వెళ్లాల్సి ఉంటుంది. సాధారణంగా రైతులు ఆవులు, గేదెలను నీళ్లలోకి వదిలి వారు మాత్రం రైల్వేట్రాక్‌పై దాటుకుని వెళ్తారు. కొన్ని సందర్భాల్లో ఆ నీళ్లలో పశువులు రాలేక మృత్యువాత పడుతున్నాయని గ్రామస్థులు పేర్కొంటున్నారు. శుక్రవారం గ్రామానికి చెందిన రైతు బాలిరెడ్డి తన గేదెలను తోలుకొని పొలానికి బయల్దేరాడు. రోజులాగే అండర్‌బ్రిడ్జి నీళ్లలో గేదెలు ఈదుకుంటూ అవతలి ఒడ్డుకు చేరడం ప్రారంభించాయి. అయితే ఓ గేదె ఈదలేక నీళ్లలోనే మృతిచెందింది. పాడి గేదె మృతిచెందడంతో రూ.1లక్ష వరకు నష్టం వాటిల్లిందని ఆ రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ఇదివరకే ఈ నీళ్లల్లో కాడెద్దులు, ఆవులు మృతిచెందాయని గ్రామస్థులు తెలిపారు. రైల్వేఅండర్‌బ్రిడ్జిలో నీటిని మోటర్ల ద్వారా బయటకు తోడేయాలని లేదా సమీపంలో చిత్రావతి నదిలోకి వెళ్లేలా కాలువ చేయాలని రైల్వేఅధికారులకు విన్నవించినా వారు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు.

గుత్తిలో అదృశ్యం.. వైటీ చెరువులో మృతదేహం



విజయలక్ష్మి (ఫైల్)

గుత్తి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): అదృశ్యమైన గుత్తి ఆర్ఎస్‌కు చెందిన విజయలక్ష్మి(54) గుంతకల్లు మండలం వైటీ చెరువులో మృతదేహమై తేలింది. రామాంజనేయులు రెడ్డి భార్య విజయలక్ష్మి రెండు రోజుల క్రితం గుత్తిఆర్ఎస్‌లోని ఇంటి నుంచి బయటకు వెళ్లింది. తిరిగి రాకపోవడంతో కుమారుడు లక్ష్మీకాంతరెడ్డి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ రామారావు, ఎస్ఐ సురేష్ ఆధ్వర్యంలో గాలింపు చర్యలు చేపట్టారు. గురువారం ఆమె వెళ్లిన పొలం ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టారు. అక్కడ రక్తపు మరకలు, మద్యం బాటిళ్లు కనిపించడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. అనంతపురం నుంచి డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీంను రప్పించి పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఎలాంటి ఆధారం దొరకలేదు. ఈ నేపథ్యంలో గుంతకల్లు మండలం వైటీ చెరువులో విజయలక్ష్మి మృతదేహం శుక్రవారం తేలింది. ఆమె ముఖం పూర్తిగా ఉబ్బిపోయి ఉంది. కుటుంబీకుల సహకారంతో ఆమె విజయలక్ష్మిగా గుర్తించారు. ఈమెది ఆత్మహత్యా, హత్యా.. అన్నది పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది. మృతదేహాన్ని గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ కేసును గుత్తి పోలీసులు దర్యాప్తు చేస్తారా.. గుంతకల్లు రూరల్ స్టేషన్ సిబ్బందా.. అన్నది తేలాల్సి ఉంది.

దివ్యాంగులకు భరోసా

వందశాతం రాయితీతో త్రిచక్ర వాహనాలు

ఆన్‌లైన్‌లో దరఖాస్తులు... ఈనెల 30 వరకు గడువు

శింగనమల, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు తీపి కబురు చెప్పింది. త్రిచక్ర వాహనాలను వందశాతం సబ్సిడీతో ఇవ్వనుంది. అందుకు దరఖాస్తులు స్వీకరిస్తోంది. దరఖాస్తు గడువును ఈనెల 30 వరకు పొడిగించింది. పదో తరగతి ఉత్తీర్ణులై, స్వయం ఉపాధి పొందుతున్న, ప్రైవేటు ఉదోగ్యం చుస్తున్న విభిన్న ప్రతిభావంతులు అర్హులు. డిగ్రీ, పీజీ చదువుతున్న విద్యార్థులు కూడా వీటిని పొందవచ్చు. addacacgov.in వైబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సంబంధిత అధికారులు తెలిపారు.

అర్హతలు

- ఒకటి లేదా రెండు కాళ్లు ప్రభావితమైన 70 శాతం వైకల్యం ఉన్నవారు
- రెండు చేతులు సక్రమంగా ఉండాలి
- 18నుంచి 45 ఏళ్లపు వయసు ఉండాలి
- ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల ద్వారా ఇంతకు మునుపు వాహనాలు తీసుకోకూడదు
- డ్రైవింగ్ లైసెన్సు తప్పనిసరి
- వార్షిక ఆదాయం రూ.3 లక్షలులోపు ఉండాలి
- తెల్లరేషన్ కార్డు తప్పనిసరి
- ఆధార్, రేషన్‌కార్డు, 10వ తరగతి మార్కుల జాబితా, వైకల్యానికి సంబంధించిన సదరం సర్టిఫికెట్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ప్రస్తుతం అందుతున్న పింఛన్ పుస్తకం సమర్పించాలి.
- డ్రైవింగ్ లైసెన్స్, ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్, అంగవైకల్యం చూపే విధంగా ఉన్న ఫొటోలను జత చేస్తూ సంబంధిత వైబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

చీనీ టన్ను రూ.22 వేలు

అనంతపురం రూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): అనంత వ్యవసాయ మార్కెట్లో శుక్రవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.22 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి ధర రూ.15వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 20టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

ఇప్పటికే చేసేశారు..!

ఇంటి దరఖాస్తులకు ఆన్‌లైన్‌లో ఎర్రర్

అభ్యర్థులకు తెలియకుండానే దరఖాస్తులు

నేటికీ ఇళ్లు, స్థలాలు రాక ఇబ్బందులు

హౌసింగ్ సర్వేలో గత ప్రభుత్వ నిర్వాకాలు వెలుగులోకి..

ఆందోళనలో నూతన దరఖాస్తుదారులు



సచివాలయంలో సర్వే దరఖాస్తు చేసుకుంటున్న అభ్యర్థులు

అనంతపురం వైద్యం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): హెచ్చరిక..! ఇప్పటికే మీరు ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నారు. మీ ఆధార్ నంబర్‌తో దరఖాస్తు చేసుకోవడం కుదరదని ఆన్‌లైన్‌లో మేసేజ్ వస్తుండటంతో దరఖాస్తుదారులు అవాక్కవుతున్నారు. ఇప్పటి వరకు మేము దరఖాస్తు చేసుకోనేలేదు. గత ప్రభుత్వంలో వలంటీర్లు ఆధార్ కార్డులు అడిగితే ఇచ్చాం అంతే అని చెబుతున్నారు. అయినా ఇల్లు రాలేదు, స్థలం ఇవ్వలేదు. ఇదెక్కడి అన్యాయమని వారు వాపోతున్నారు. అందరికి సొంత ఇళ్లు నినాదంతో కూటమి ప్రభుత్వం ఈనెల 10నుంచి హౌసింగ్ సర్వే నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. గృహనిర్మాణ సంస్థ డిప్యూటీ ఇంజనీర్(డీఈ), అసిస్టెంట్ ఇంజనీర్(ఏఈ)లు సచివాలయ సిబ్బందితో కలిసి గ్రామాల్లో సర్వే చేపట్టారు. ఇందులో భాగంగా గ్రామ పంచాయతీల వారిగా ప్రతి కుటుంబం వద్దకెళ్లి మీకు స్థలం ఉందా? సొంత ఇల్లు ఉందా? అని వివరాలు సేకరిస్తున్నారు. ఇల్లు, స్థలం లేనివారికి కొత్తగా మంజూరు చేసేలా దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. అయితే దరఖాస్తుదారుల ఆధార్ నంబర్‌ను ఆన్‌లైన్ యాప్, పోర్టల్లో ఎంటర్ చేయగానే హెచ్చరిక..! అంటూ ఇదివరకే దరఖాస్తు చేసినట్లు మేసేజ్ వస్తోంది. దీంతో ఇల్లు, స్థలం మంజూరు అవుతుందా? లేదా? అని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆన్‌లైన్‌లోనే స్థలం, ఇల్లు

లక్షల మందికి జగనన్న ఇంటి స్థలాలు కేటాయించి సొంత ఇళ్లను నిర్మించామని గత వైసీపీ ప్రభుత్వం ప్రచారం చేసుకుంది. అయితే ఇదంతా కేవలం ఆన్‌లైన్‌లో మాత్రమే ఉందని బాధిత వర్గాలు మండిపడుతున్నాయి. గత ప్రభుత్వ నిర్వాకంతో నేటికీ అద్దె ఇళ్లు, గుడిసెల్లోనే జీవనం సాగిస్తున్నామని వాపోతున్నారు. ఊరందరికీ ఇస్తే జగనన్న స్థలాలు, ఇళ్లు ఏమైయ్యాయని ప్రశ్నిస్తున్నారు. గత ప్రభుత్వంలోని దరఖాస్తులను డిలిట్ చేసి, ప్రస్తుత సర్వేలో అప్లికేషన్ తీసుకోవాలని, ఆమేరకు స్థలం, ఇల్లు మంజూరు చేయాలని బాధితులు వేడుకుంటున్నారు.

మీరింకా అప్‌డేట్ కాలేదు

ప్రస్తుత హౌసింగ్ సర్వేలో అనేకమంది దరఖాస్తులను ఆన్‌లైన్‌లో తీసుకోవడంలేదు. మీ ఆధార్‌కు ఫోన్ నంబర్ లింక్ కాలేదని, ఫింగర్ ప్రింట్, ఐరిష్ అప్‌డేట్ కాలేదని ఎర్రర్ చూపిస్తోంది. అదేవిధంగా కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను పొందలేదని ఎర్రర్ వస్తోంది. ఇలా ప్రతి గ్రామంలో పదుల సంఖ్యలో దరఖాస్తులు ఇలాంటి ఎర్రర్‌లు వస్తున్నట్లు సర్వేలో పాల్గొంటున్న సిబ్బంది చెబుతున్నారు. సొంత స్థలం, ఇల్లు లేక చాలా జంటలు వారి తల్లిదండ్రుల ఇళ్లలోనే కాపురముంటున్నాయి. ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హులైనా దరఖాస్తు చేయలేని పరిస్థితి. అప్‌డేట్ చేసుకోవడానికి దరఖాస్తుల స్వీకరణ గడువు పొడిగేస్తే అర్హులకు న్యాయం చేయవచ్చునని సర్వే వర్గాలు వివరిస్తున్నాయి.

ఒక్కరోజే 8వేలు..

సర్వే ప్రారంభమైన 10 తేదీ నుంచి 18రోజుల్లో 33వేల కుటుంబాలను సర్వేచేశారు. శుక్రవారం ఒక్కరోజులోనే 8వేల కుటుంబాలను సర్వేచేసినట్లు గృహనిర్మాణ సంస్థ అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. అన్ని గ్రామాల్లోనూ సర్వే పూర్తి చేశామని ప్రభుత్వానికి నివేదిక పంపడానికి ఇలా చెబుతున్నారా? లేక గత ప్రభుత్వంలో చేసిన తప్పిదాలనే మార్గదర్శకంగా తీసుకున్నారా? అనే అనుమానాలు ఉత్పన్నమౌతున్నాయి. క్షేత్రస్థాయిలో సిబ్బందికి ఎదురౌతున్న సమస్యలకు అధికారులు చెబుతున్న వివరాలకు పొంతనలేదని గణాంకాల పరిశీలక వర్గాలు విశ్లేషిస్తున్నాయి. శని, ఆదివారం వరకు సర్వేగడువు ఉన్నప్పటికీ సమస్యలు పరిష్కారం కావని పేర్కొంటున్నాయి.

దంపతుల్లో ఒకరు..

నూతన ఇల్లు, స్థల దరఖాస్తులకు కుటుంబంలోని భార్య, భర్త ఇద్దరూ అర్హులే. భార్య ఆధార్ నంబర్‌కు ఎర్రర్ వచ్చినప్పుడు భర్త ఆధార్ నంబర్‌తో దరఖాస్తు చేయాలి. భర్త ఆధార్‌కు ఎర్రర్ వస్తే భార్య ఆధార్‌తో ఎన్‌రోల్ చేయాలి. వెరిఫికేషన్‌లో అర్హులుగా గుర్తిస్తే ఇల్లు మంజూరు అవుతుంది. జిల్లాలో ఎన్ని కుటుంబాలున్నాయి, వీటిలో ఎన్ని కుటుంబాలకు సొంత ఇల్లు, స్థలం లేదని సర్వే చేస్తున్నాం.

- శైలజ, జిల్లా గృహనిర్మాణ సంస్థ అధికారి

రూ.10 వేల లంచానికి ఏడేళ్ల జైలు

కర్నూలు ఏసీబీ కోర్టు తీర్పు

అనంతపురం క్రైం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): లోన్ సెటిల్‌మెంట్ కోసం రూ.10వేలు లంచం తీసుకున్నందుకు ఓ అధికారికి ఏడేళ్ల జైలు, లక్ష జరిమానా పడింది. ఈ మేరకు కర్నూలు ఏసీబీ స్పెషల్ కోర్టు న్యాయాధికారి శుక్రవారం తీర్పు వెలువరించారు. కదిరి ప్రాంతం జోకుపాలెంకు చెందిన షైక్ షామీర్ బాషా అత్తకు ఏపీ కో -ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ఫెడరేషన్ లిమిటెడ్ రూ.1.20 లక్షల రుణం మంజూరు చేసింది. ఆమె లోన్ మొత్తాన్ని తిరిగి చెల్లించలేకపోయింది. వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కోసం ఏపీ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ఫెడరేషన్ లిమిటెడ్ అనంతపురం అసిస్టెంట్ రిజిస్ట్రార్ సుబ్బయ్యను సంప్రదించగా లంచం అడిగారు. దీంతో బాధితులు ఏసీబీ అధికారులను ఆశ్రయించా రు. ఆ అధికారి బాధితుల నుంచి రూ.10 వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు 2013 మే 3న రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కేసు నమోదు చేసి, కర్నూలు ఏసీబీ ప్రత్యేక కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేసిన న్యాయస్థానం ముద్దాయి సుబ్బయ్యకు ఐదేళ్ల జైలు, రూ. లక్ష జరిమానా విధించింది. జరిమానా చెల్లించకుంటే ఆరు మాసాల సాధారణ జైలు శిక్ష విధించబడుతుందని న్యాయాధికారి పేర్కొన్నారు. అలాగే పీసీ యాక్ట్ 1988లోని సెక్షన్ 13(2), ఆర్/డబ్ల్యూ 13(1)(డి) కింద 7 ఏళ్ల జైలు, రూ.1లక్ష జరిమానా విధించారు. ఈ రెండు శిక్షలు ఒకేసారి అమల్లోకి వస్తాయని, జరిమానా మొత్తంలో నుంచి రూ.10 వేలు ఫిర్యాదుదారుడికి పరిహారంగా ఇవ్వాలని న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు.

7న ఎన్ఎంఎంఎస్ పరీక్ష

కొత్తచెరువు/అనంతపురం విద్య, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఎన్ఎంఎంఎస్(నేషనల్ మెరిటి మీన్స్ స్కాలర్‌షిప్) పరీక్ష డిసెంబరు 7న నిర్వహించనున్నట్లు ఉమ్మడి జిల్లా విద్యాశాఖాధికారులు శుక్రవారం ప్రకటనలో తెలాపారు. పరీక్షలు ఉదయం 10 నుంచి ఒంటిగంట వరకు జరుగుతాయన్నారు. విద్యార్థులు హాల్‌టిక్కెట్లను ప్రభుత్వ పరీక్షల సంచాలకుల వెబ్‌సైట్ www.bse.gov.in లోగానీ, వాట్సాప్-మనమిత్రాలోగానీ డౌన్‌లోన్ చేసుకోవాలన్నారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాఠశాల యు-డైసి లాగిన్‌లో విద్యార్థులకు హాల్‌టికెట్లను అందజేయాలన్నారు. హాల్‌టిక్కెట్‌లోని క్యూఆర్‌కోడ్‌ను స్కాన్ చేయడం వల్ల విద్యార్థి పరీక్షాకేంద్రాన్ని తెలుసుకోవచ్చని తెలిపారు. పరీక్షా కేంద్రానికి గంట ముందుగా విద్యార్థులు చేరుకోవాలని సూచించారు.

పది పరీక్షల ఫీజు చెల్లింపు గడువు పొడిగింపు

అనంతపురం విద్య, నవంబరు28(ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యాసంవత్సరంలో పదోతరగతి పరీక్షల ఫీజు చెల్లింపు గడువును పొడిగించినట్లు డీఈఓ ప్రసాద్‌బాబు, ఏసీ వెంకటేశులు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. డిసెంబరు 6వరకు సాధారణ రుసుంతో పరీక్ష ఫీజు చెల్లించవచ్చన్నారు. డిసెంబరు 7నుంచి 9 వరకు రూ.50, డిసెంబరు 10 నుంచి 12 వరకు రూ.200.., 13నుంచి 15 వరకు రూ.500 అపరాధ రుసుంతో ఫీజు చెల్లించవచ్చని డీఈఓ, ఏసీ తెలిపారు.

గొర్రెల కాపరిపై దాడి



దాడిలో గాయపడిన ఆంజనేయులు

కళ్యాణదుర్గం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వాహనానికి గొర్రెలు అడ్డుగా వచ్చాయని కాపరి ఆంజనేయులుపై విక్రం అనే వ్యక్తి దాడి చేశారు. కళ్యాణదుర్గం మండలం బోరంపల్లికి చెందిన ఆంజనేయులు, తన గొర్రెల మందను మేత కోసం శుక్రవారం సమీప గ్రామ పరిసర ప్రాంతానికి తీసుకెళ్లాడు. గొర్రెలను సాయంత్రం తిరిగి తీసుకువచ్చే క్రమంలో ప్రధాన రహదారిని దాటిస్తుండగా అనంతపురం నుంచి కళ్యాణదుర్గం వైపు విక్రం వాహనం వచ్చింది. వాహనానికి గొర్రెలు అడ్డుగా రావడంతో కాపరిపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఈ క్రమంలో వాగ్వాదం జరిగి ఆంజనేయులుపై దాడి చేశారు. దీంతో ఆగ్రహించిన గ్రామస్థులు, వాహనాన్ని అడ్డుకుని, విక్రంను నిలదీశారు. పోలీసులకు సమాచారం అందడంతో వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. బాధితుడి నుంచి ఫిర్యాదు స్వీకరించి, కేసు నమోదు చేశారు. గాయపడ్డ గొర్రెల కాపరి అంజనేయులు కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆస్పత్రిలో చేరాడు. దాడి చేసిన విక్రం మాజీ ఎమ్మెల్యే బండి హుళికుంతప్ప తనయుడు.

ప్రియురాలు మోసగించిందని

యువకుడి ఆత్మహత్య

మడకశిర రూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రేమించిన అమ్మాయి మోసగించిందని మడకశిర మండలం హరేసముద్రం గ్రామానికి చెందిన రాజు(24) అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు, తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో రాజు పీజీ పూర్తి చేశాడు. ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నాడు. చదువుకునే రోజుల్లో ఓ అమ్మాయిని ప్రేమించాడు. ఆమె మోసగించిందని బాధపడేవాడు. ఈ క్రమంలో గురువారం తిరుపతి నుంచి స్వగ్రామానికి వచ్చాడు. తన ప్రియురాలు మోసగించినందుకే బలవన్మరణానికి పాల్పడుతున్నానని సూసైడ్ నోట్ రాసిపెట్టి, శుక్రవారం తన ఇంట్లో ఉరి వేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించేలోగా ప్రాణాలను కోల్పోయాడు. దీంతో వారు కన్నీరుమున్నీరుగా విలపించారు. తండ్రి రామచంద్రప్ప ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని మడకశిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అందరితో సమంగా దివ్యాంగులు

పారా స్పోర్ట్స్‌మీట్‌లో డీఈఓ కిష్టప్ప



లాంగ్‌జంప్ చేస్తున్న దివ్యాంగ విద్యార్థి

కొత్తచెరువు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): క్రీడలలో అందరితో సమానంగా దివ్యాంగ విద్యార్థులు రాణిస్తున్నారని డీఈఓ క్రిష్టప్ప తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో దివ్యాంగ విద్యార్థులకు పారా స్పోర్ట్స్‌మీట్‌ను శుక్రవారం ఎస్ఎస్ఏ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈస్పోర్ట్స్‌మీట్‌కు జిల్లా నలుమూలల నుంచి 140 మంది విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరయ్యారు. అండర్-17, 19 విభాగాలలో 400, 100, 200 మీటర్ల పరుగు పందేలను బాలురు, బాలికలకు వేర్వేరుగా నిర్వహించారు. షాట్‌పుట్, లాంగ్‌జంప్, హైజంప్ అండర్-17, 19 విభాగాల్లో బాలురు, బాలికలకు విడివిడిగా పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో గెలుపొందిన దివ్యాంగ విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతోపాటు ప్రశంసాపత్రాలను డీఈఓ అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఏపీసీ దేవరాజ్ పాల్గొన్నారు.

పూలే సేవలు చిరస్మరణీయం

జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ



నివాళులు అర్పిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

అనంతపురం న్యూటౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మహిళా విద్య, సాధికారతకు జ్యోతిరావ్ పూలే చేసిన సేవలు చిరస్మరణీయమని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గిరిజమ్మ పేర్కొన్నారు. పూలే వర్ధంతి సందర్భంగా శుక్రవారం జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలోని పూలే దంపతుల విగ్రహాల వద్ద బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘన నివాళులు అర్పించారు. పూలే దంపతుల విగ్రహాలకు జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఆమె మాట్లాడుతూ.. జ్యోతిరావ్ పూలే.. మహిళా విద్యకు ప్రాధాన్యమిచ్చారన్నారు. మహిళా సాధికారతకు ఎంతో కృషి చేశారన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ శివశంకర్, ఏఓలు భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

దీర్ఘకాలిక సెలవులో దేవదాయ శాఖ ఏసీ

ఇన్‌చార్జి ఏసీగా సుధారాణి

అనంతపురం టౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): దేవదాయ ధర్మదాయశాఖ జిల్లా సహాయ కమిషనర్ (ఏసీ) తిరుమలరెడ్డి వ్యక్తిగత పనుల నేపథ్యంలో నెలరోజులపాటు దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. ఆయన స్థానంలో జిల్లాకేంద్రంలోని పాతూరు చెన్నకేశవస్వామి ఆలయ ఈఓ సుధారాణికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. దీంతో ఆమె శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఏసీని ఉమ్మ డి జిల్లా అర్చక సమాఖ్య నాయకులు శాలువా కప్పి సత్కరించారు. అర్చకులకు రైతు భరోసా, అమ్మ ఒడి వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కోరారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా అర్చక సమాఖ్య అధ్యక్షుడు వైపీ ఆంజనేయులు, నాయకులు పాల్తూరు విజయ్, శ్రీనివాసులు, కేబీసీ రాయల్, శివశంకర్, తిరుపతయ్య పాల్గొన్నారు.

పాత ఖాతాల్లో నగదు తీసుకోండి: కలెక్టర్

పుట్టపర్తి టౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): తగిన ఆధారాలతో పాత ఖాతాల్లోని నగదును ఖాతాదారులు తీసుకోవాలని కలెక్టర్ శ్యాంప్రసాద్ సూచించారు. ఆర్‌బీఐ చేపట్టిన మీ డబ్బు-మీహక్కు కార్యక్రమం ద్వారా పదేళ్లుగా లావాదేవీలు లేని బ్యాంకు ఖాతాల నుంచి ప్రజలు తమ డబ్బును తిరిగి తీసుకునేలా విస్తృత అవగాహన కల్పించాలన్నారు. ఇందుకు సంబంధించి శుక్రవారం కలెక్టరేట్‌లో ఆయన పోస్టర్లు ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 2,88,083 లావాదేవీలు నిలిచిపోయిన ఖాతాలు ఉన్నాయని వాటిలో రూ.66.95కోట్లు అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లుగా ఉన్నట్లు తెలిపారు. ఈనిధులు సంబంధిత బ్యాంకు హెడ్ ఆఫీసుల నుంచి ఆర్‌బీఐకి బదిలీ అయినట్లు పేర్కొన్నారు. ఈ డబ్బును తిరిగి పొందేందుకు అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లు ఉన్నవారు ఆధార్, పాన్, పాస్‌పోర్టు ఫొటోతో సమీప బ్యాంకు శాఖల్లో సంప్రదించాలన్నారు. ఖాతాదారుడు మరణించిన సందర్భంలో వారసులు డెత్ సర్టిఫికెట్, కుటుంబ సభ్యుల అంగీకార పత్రంతో పాటు బ్యాంకు కోరిన ఇతర ఆధారాలను సమర్పించి, అన్‌క్లెయిమ్డ్ నగదును పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం రమణకుమార్, సీపీఓ విజయకుమార్ పాల్గొన్నారు.

సుబ్బరాయసాగర్‌ను పరిశీలించిన జేసీ



అధికారులతో మాట్లాడుతున్న జేసీ

పుట్లూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుబ్బరాయసాగర్‌ను జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మొరాయించిన గేట్‌ను పరిశీలించి సమస్యను అడిగి తెలుసుకున్నారు. గేట్ మొరాయించడంతో అరకొరగా వచ్చే నీటిని చూశారు. గేట్ మరమ్మతులు చేసి, రైతులకు ఇబ్బందులు లేకుండా సమస్యను పరిష్కరించాలని హెచ్చెల్సీ అధికారులను ఆదేశించారు. ఆయన వెంట హెచ్చెల్సీ ఏఈ శ్రీనివాసులు, సిబ్బంది ఉన్నారు.

త్వరలో ఏడీసీసీబీలో ఓటీఎస్



అప్కాబ్ మహాజన సభలో పాల్గొన్న ముంటిమడుగు కేశవరెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పేరుకుపోయిన బకాయిల వసూళ్లు, ఎన్‌పీఏ తగ్గింపునకు త్వరలో ఏకకాల రుణచెల్లింపు (ఓటీఎస్) అమలు చేసి పరిష్కరిస్తామని ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి తెలిపారు. రాజధాని అమరావతిలో శుక్రవారం జరిగిన బ్యాంకుల ప్రధాన కార్యాలయాల నిర్మాణానికి భూమిపూజలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆప్కాబ్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక మహాజనసభలో పాల్గొన్నారు. ఏడీసీసీ బ్యాంకు, సొసైటీలలో పేరుకుపోయిన మొండిబకాయిలు, ఎన్‌పీఏ తగ్గించేందుకు ఏకైక పరిష్కార మార్గం ఏకకాల రుణ చెల్లింపు(ఓటీఎస్)అమలు చేయడంపై ఆప్కాబ్ ఉన్నతాధికారులతో చైర్మన్ చర్చించారు. త్వరలో ఓటీఎస్ ద్వారా రుణ పరిష్కారం చేపడుతామని చైర్మన్ తెలిపారు.

సబ్‌జైలు తనిఖీ

పెనుకొండ టౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పెనుకొండ సబ్‌జైలును లోక్ అదాలత్ చైర్మన్, సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి వాసుదేవన్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ క్రమంలో ఖైదీల సమస్యలు విచారించి వారికి అందుతున్న సదుపాయాలపై ఆరాతీశారు. అనంతరం న్యాయసహాయం, ఉచిత లాయర్ సహాయం తదితర వాటిపై అడిగి తెలుసుకున్నారు. అనారోగ్యంతో ఉన్నవారికి తక్షణం ఆరోగ్య పరీక్షలు చేయించాలని సూపరింటెండెంట్‌కు సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు నాగిరెడ్డి, విక్రాంత్ తదితరులు పాల్గొన్నారు.



సౌకర్యాలపై ఆరాతీస్తున్న వాసుదేవన్

న్యూస్ బాక్స్

ఉత్సవ విగ్రహానికి ప్రాణప్రతిష్ఠ



కదిరిఅర్బన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో శుక్రవారం స్వామివారి ఉత్సవ విగ్రహానికి ప్రాణప్రతిష్ఠను వైభవంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి శబరిమల ఆలయం మాజీ మెయిల్ చాంపీ రెజీకుమార్ నంబూద్రి హాజరై, శాస్త్రోక్తంగా నిర్వహించారు. విగ్రహ దాతలు గజ్జలరెడ్డిపల్లికి చెందిన లక్ష్మీదేవమ్మ కుటుంబ సభ్యులతో కలశపూజ ప్రారంభించి, స్వామివారికి వివిధ నైవేద్యాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, తీర్థప్రసాదాలు స్వీకరించారు. గురుస్వామి తులసీస్వామి, కోటి, అప్పల్ల, శ్రీనివాసులు, ఆలయ ట్రస్టు సభ్యులు శంకరయ్య, వెంకటరమణ, రమేష్‌బాబు పాల్గొన్నారు.

డ్రైనేజీ కాలువ పనులు పూర్తి చేయండి: సీపీఐ



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

ముదిగుబ్బ, నవంబరు28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో డ్రైనేజీ పనులు పూర్తి చేయాలని సీపీఐ నాయకులు కోరారు. అధికారుల మధ్య సమన్వలోపంతో మండల కేంద్రంలో డ్రైనేజీ పనులు నత్తనడకన సాగుతున్నాయని సీపీఐ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు ఆరోపించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండల కేంద్రంలో ఇంటర్నల్ రోడ్డు నిర్మాణంలో భాగంగా రెండు కి.మీ పొడవుతో అనంతపురం-చెన్నై రహదారి ఇరువైపులా మూడు నెలల నుంచి డ్రైనేజీ నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. పట్టణంలో జనసంచారం ఉన్న చాలా ప్రాంతాలలో డ్రైనేజీ పనులు పూర్తి చేయకపోవడంతో సమస్యగా మారిందన్నారు. సంబంధిత అధికారులు సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలనీ, లేనిపక్షంలో ప్రజలతో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

చర్మవ్యాధుల నుంచి రక్షించండి

● ఎమ్మెల్యే, మాజీ మంత్రికి కొత్తచెరువు వాసి వినతి

కొత్తచెరువు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): బుక్కపట్నం చెరువులో నీరు కలుషితమయ్యాయని, వాటిని బో రుబావుల ద్వారా వాడటంవల్ల చర్మవ్యాధులు వస్తున్నాయని కొత్తచెరువుకు చెందిన సాలమ్మగారి శివప్రసాద్ శుక్రవారం పుట్టపర్తి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డిలకు వినతిపత్రం ఇచ్చారు. చెరువులోని నీటిని పంట పొలాలకు వదిలివేసి పూడికను తొలగించాలని కోరారు. తిరిగి హంద్రీనీవా ద్వారా కొత్త నీటిని విడుదల చేయాలని ఆయన వారిని కోరారు. అనంతరం సాగునీటి సంఘం అధ్యక్షుడు నవీన్‌కుమార్‌కు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు.

బాలిక ఆత్మహత్యాయత్నం కేసులో

పోలీసుల నిర్లక్ష్యం లేదు: డీఎస్పీ

ధర్మవరం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): చెన్నేకొత్తపల్లికి చెందిన బాలిక ఆత్మహత్యాయత్నం ఘటనలో పోలీసుల నిర్లక్ష్యం లేదని, ఫిర్యాదు చేసిన వెంటనే కేసు నమోదు చేసి, చట్టబద్ధంగా చర్యలు తీసుకున్నారని ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్ తెలిపారు.ఈ మేరకు డీఎస్పీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. 26వ తేదీన సీకేపల్లికి చెందిన ఓ బాలిక తనపట్ల ఓ బాలుడు వేధిస్తున్నాడన్న విషయంపై బాలిక సీకేపల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందన్నారు. అక్కడ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశామన్నారు. అమ్మాయి మైనర్ కావడంతో పోలీసు స్టేషన్‌లో ఎక్కువ సేపు ఉంచకుండా ఇంటికి పంపించామన్నారు. ఐసీడీఎస్, సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చామని, వెంటనే వేధించిన బాలుడిని పిలిచి విచారణ చేశామన్నారు. ఇంటికి వెళ్లిన బాలిక ఆత్మహత్యకు యత్నించిందన్నారు.

కేతిరెడ్డీ.. ఖబడ్దార్

● జనసేన నాయకుల హెచ్చరిక

ధర్మవరం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి సోదరుడు కేతిరెడ్డి వెంకటక్రిష్ణారెడ్డిని గ్రా మాల్లోకి పంపించి చి చ్చు పెట్టాలని చూస్తే ఖ బడ్దార్ అంటూ జనసేన పార్టీ నాయకులు హెచ్చరించారు. జనసేన పార్టీ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో శ్రీనివాసులు, శ్యాంకుమార్, రాజు, నాగ సుధాకర్‌రెడ్డి, బాషా మాట్లాడారు. 460-1ఏ సర్వేనంబరులో ఉన్న భూమి జనసేన పార్టీకి సంబంధించిన మాలగుంట్ల గుర్రప్పది అని, ఆయన భూమిలోకి వెళ్లి ఆయనే చెట్లు నరికివేశారన్నారు. కేతిరెడ్డి వెంకటక్రిష్ణారెడ్డిని గ్రామాల్లోకి పంపించి చిచ్చుపెట్టాలని చూడటం సరికాదన్నారు. మామిడిచెట్లు నరికేశారని చెప్పిన తోటలో అసలు మామిడి చెట్లే లేవని, లేని మామిడిచెట్లు ఎలా వచ్చాయో మీరే చెప్పాలని ప్రశ్నించారు. పచ్చనిచెట్లు నరికేసి, భూకబ్జాలు చేసే సంస్కృతి ఎవరిదో ప్రజలందరికి తెలుసన్నారు.

అనారోగ్యంతో టీడీపీ కార్యకర్త మృతి

ముదిగుబ్బ, నవంబరు, 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని సంకేపల్లికి చెందిన టీడీపీ కార్యకర్త మల్లాది వెంకటనాయుడు(55) శుక్రవారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. కార్యకర్త మృతదేహానికి టీడీపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి రమేష్‌బాబు, మండల కన్వీనర్ కరణం ప్రభాకర్, మాజీ సర్పంచ్ రమేష్ నాయుడు, మండల నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

రాష్ట్రస్థాయి జూడో పోటీలు ప్రారంభం

ధర్మవరంరూరల్, నవంబరు28(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిగిచెర్ల జడ్పీ పాఠశాల మైదానంలో రాష్ట్రస్థాయి జూడోపోటీలు శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. 69వ రాష్ట్ర స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్, ఇంటర్ డిస్ట్రిక్ అండర్-14, అండర్-19 బాల బాలికలకు ఈ పోటీలు నిర్వహించారు. ఈ క్రీడలు 28నుంచి 30వరకు నిర్వహించనున్నారు. ఈపోటీలలో పాల్గొనే క్రీడాకారులందరికి టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ పరిటాల రవీంద్ర మెమోరియల్ ట్రస్టు తరఫున క్రీడాదుస్తులు పంపిణీ చేశారు. మాజీ జడ్పీ చైర్మన్ ఓబిరెడ్డి, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీ‌ష్‌బాబు, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ మహబూబ్‌బాషా, ఎంపీడీఓ సాయిమనోహర్ పోటీలను ప్రారంభించారు. వారు ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకుని, మార్చ్‌ఫాస్ట్‌ను పరిశీలించారు. అనంతరం మాజీ జడ్పీచైర్మన్ ఓబిరెడ్డి మాట్లాడుతూ క్రీడలు విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తుని ఇస్తాయన్నారు. హరీష్‌బాబు మాట్లాడుతూ క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించడంలో కూటమి ప్రభుత్వం ముందుందని తెలిపారు. కార్యక్రమంలో స్టేట్ అబ్జర్వర్ జయసింహ, పాఠశాల హెచ్ఎం తిమ్మారెడ్డి, జిల్లా స్కూల్‌గేమ్స్ కార్యదర్శులు శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, సుహాసిని, చామంతి తదితరులు పాల్గొన్నారు.



జూడో పోటీలను ప్రారంభిస్తున్న చిగిచెర్ల ఓబిరెడ్డి, హరీష్‌బాబు

తీరని రస్తా వివాదం

● అధికారుల ప్రయత్నం విఫలం
● ప్రశాంతంగా ఉన్నగ్రామంలో మళ్లీ సమస్యలు

తాడిమర్రి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): అసలే ఆ గ్రామం ఫ్యాక్షన్‌తో ఇబ్బందుల పాలైంది. ఇటీవలి కాలంలో ఎలాంటి తగాదాలు, సమస్యలు లేకుండా ప్రజలు సుఖశాంతులతో జీవించారు. ఇలాంటి తరుణంలో మళ్లీ గ్రామప్రజలకు కునుకు లేకుండా చేస్తోంది రస్తా సమస్య. మండలంలోని చిల్లకొండయ్యపల్లి గ్రామంలో గడచిన 50 సంవత్సరాలుగా వాడుతున్న రస్తాను వారం రోజుల క్రితం గ్రామానికి చెందిన ఒక మహిళా రైతు రస్తాలేదంటూ దారికి అడ్డుగా గుంత తీయించింది. ఆలస్యంగా స్పందించిన రెవెన్యూ సిబ్బంది గురువారం అక్కడికి చేరుకుని సమస్యపై ఆరాతీసి ఇక్కడ రస్తా ఉందని తెలియజేసి అడ్డుగా వేసిన మట్టిని తొలగించి మహిళా రైతుకు చెప్పివచ్చారు. సాయంత్రానికే మళ్లీ ఆ రైతు దారికి అడ్డుగా కంపవేయించి మట్టివేసింది. ఈ దారి లేకపోవడం వల్ల 70 మంది రైతులు పొలాలకు వెళ్లడానికి నానా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. రెవెన్యూ సిబ్బంది స్పందించి సదరు రైతుపై ఫిర్యాదు చేస్తే తాము రెవెన్యూ సిబ్బందికి తోడుగా వచ్చి సమస్యను పరిష్కరిస్తామని చెబుతున్నా పోలీసులకు ఎందుకో ఫిర్యాదు చేయడంలేదు. అసలే ఫ్యాక్షన్ గ్రామం కావడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని ప్రజలు భయపడుతున్నారు. పోలీసులు మాత్రం రెవెన్యూ అధికారులు ఫిర్యాదు చేస్తే తప్ప.. సమస్యను పరిష్కరించలేమని అంటున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి ఒకరిపై ఒకరు చెప్పుకోకుండా సమస్యను పరిష్కరించి గ్రామంలో ప్రశాంతంగా ఉండేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



సమస్యాత్మక దారిని పరిశీలిస్తున్న పోలీసులు

అర్జీలకు తక్షణ పరిష్కారం చూపాలి: ఎమ్మెల్యే సింధూర



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే, మాజీ మంత్రి

పుట్టపర్తిరూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిస్కారం కోసం ప్రజాగ్రీవెన్సులో ప్రజలు సమర్పించిన అర్జీలకు తక్షణ పరిస్కారం చూపాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి ఆదేశించారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపుకార్యాలయంలో నిర్వహించిన ప్రజాగ్రీవెన్సులో ఎమ్మెల్యే, మాజీమంత్రి నియోజకవర్గ ప్రజలనుంచి ఫిర్యాదులు స్వీకరించారు. క్షేత్రస్థాయిలో ఫిర్యాదులను పరిశీలించి గ్రీవెన్సులో వచ్చిన అర్జీలు పునరావృతం కాకుండా అధికారులు చిత్తశుద్ధితో పరిష్కరించాలని సూచించారు. రెవెన్యూ, ఆస్తివివాదాలు, డ్రైనేజ్‌లోపాలు, కొత్తసీసీరోడ్లు, పింఛన్లు, పక్కాగృహాల మంజూరు తదితరవాటిపై ఫిర్యాదు అందాయి.

రైతుల సంక్షేమమే సీఎం ఆశయం: రైతుల సంక్షేమమే సీఎం చంద్రబాబు ఆశయమని ఎమ్మెల్యే పల్లెసిఇంధూరారెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం రైతులు 140 మందికి 280 యూరియా బస్తాలను ఆమె అందచేశారు. ఆమె మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తోందని, ప్రతిరైతుకు అవసరమైన ఎరువులు సమృద్ధిగా ఉన్నాయన్నారు. మాజీ మంత్రి పల్లె రఘనాధరెడ్డి మాట్లాడుతూ ఇది నిజమైన రైతుప్రభుత్వమని, ఇప్పటికే అన్నదాత సుఖీభవ-పీఎంకిసాన్ పథకాల ద్వారా రైతుల ఖాతాల్లో రూ.14వేలు జమ చేశారన్నారు. సొసైటీ అధ్యక్షుడు వెంకటరాముడు, సీఈఓ రవిశంకర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

పారిశుధ్యాన్ని మరింత మెరుగుపరచాలి: కలెక్టర్



ఆర్టీసీ బస్టాండ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

ధర్మవరం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో పారిశుధ్యాన్ని మరింత మెరుగుపరచాలని కలెక్టర్ శ్యాంప్రసాద్ ఆదేశించారు. శుక్రవారం రాత్రి ఆర్టీసీ బస్టాండ్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీచేశారు. బస్టాండ్‌లో ప్రయాణికులకు అందిస్తున్న సేవల నాణ్యత, పరిసరాల పరిశుభ్రత, మౌలిక సదుపాయాలపై సమగ్రంగా పరిశీలించారు. బస్టాండ్‌లో మరుగుదొడ్లు, షాపులు, డ్రైనేజీ వ్యవస్థ, లైటింగ్, ఇతర సౌకర్యాలను వ్యక్తిగతంగా తనిఖీ చేశారు. ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉన్న బస్టాండ్‌లో పారిశుధ్య నిర్వహణ ప్రాధాన్యం పెంచాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. ఆర్డీఓ మహేశ్, తహసీల్దార్ సురేశ్‌బాబు,వీఆర్వో రవిశేఖర్‌రెడ్డి, ఆర్టీసీ డీఎం సత్యనారాయణ పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై కలెక్టర్ సమీక్ష: మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం ఓటరు జాబితాప్రత్యేక సవరణ-2025 ప్రీ-ఆర్టివిటీ పురోగతిపై కలెక్టర్ శ్యాంప్రసాద్ బీఎల్‌ఓలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న ప్రీ-యాక్టివిటీ క్యాంపెయిన్లో ఎన్నికల కమిషన్ నిర్దేశించిన విధంగా ఎలక్టోరల్ రోల్ డేటాను వేగంగా, కచ్చితంగా మ్యాపింగ్ చేయాలని సూచించారు. ఓటర్ల వివరాలు, చిరునామాలు, కుటుంబాల మ్యాపింగ్, గృహ నెంబర్ల వంటి అంశాల్లో తప్పులకు తావు ఇవ్వకుండా జాగ్రత్తతో పనిచేయాలని ఆదేశించారు.ఆర్డీఓ మహేశ్, మున్సిపల్ కమిషనర్ సాయికృష్ణ పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్ల తనిఖీ

ధర్మవరంరూరల్: పట్టణంలోని మార్కెట్‌యార్డులో ఉన్న ఈవీఎం గోడౌన్లను కలెక్టర్ శ్యాంప్రసాద్ శుక్రవారం గుర్తింపుపొందిన రాజకీయపార్టీల ప్రతినిధుల సమక్షంలో పరిశీలించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నెలవారీ తనిఖీల్లో భాగంగా ఈవీఎంలను భద్రపరిచిన గోడౌన్ల భద్రతకు తీసుకుంటున్న జాగ్రత్తలను ఆయన సమీక్షించారు. గోడౌన్ వద్ద సీసీకెమెరా వ్యవస్థ, ఫైర్‌సేఫ్టీ, 24గంటల భద్రతా ఏర్పాట్లను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ఆర్డీఓ మహేష్, తహసీల్దార్ సురేష్‌బాబు, వివిధ రాజకీయపార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

అనుమతి లేనిదే ఊరేగించరాదు: ఆర్డీఓ

బత్తలపల్లి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని యర్రాయపల్లి గ్రామంలో సంగాలప్పస్వామి ఊరేగింపును అధికారుల నుంచి అనుమతి వచ్చేవరకు నిలిపివేయాలని ఆర్డీఓ మహేష్ తెలిపారు. గ్రామంలోని సంగాలప్పస్వామి మాదంటే మాది అని గ్రామస్థులు, రాప్తాడు మండలం గంగలకుంట గ్రామస్థులు సుప్రీం కోర్టుకు వెళ్లారన్నారు. గంగలకుంట గ్రామస్థులు వేసిన పిటిషన్‌లో పేర్కొన్నఆధారాలను నిరూపించకపోవడంతో న్యాయస్థానం వారి పిటిషన్‌ను తిరస్కరించింది. యర్రాయపల్లి గ్రామస్థులు శనివారం గొల్లపల్లిలో ఊరేగింపు చేసేందుకు సిద్ధమయ్యారు. శాంతిభద్రతల సమస్య తలెత్తుందని ఆర్డీఓ మహేష్, సీఐ ప్రభాకర్, ఎస్ఐ సోమశేఖర్ ఇరువర్గాల వారిని పిలిపించి తహసీల్దార్ కార్యాలయంలో సమావేశమయ్యారు. వారి అభిప్రాయాలు తెలుసుకుని, జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళతామన్నారు.

బీజేపీ నాయకుడికి పరామర్శ

బత్తలపల్లి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్రాచెరువు గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు వీరనారప్ప కొన్నిరోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న జనసేన రాష్ట్ర నాయకుడు చిలకం మధుసూదన్‌రెడ్డి గ్రామానికి వెళ్లి ఆయనను పరామర్శించి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

టీడీపీని మరింత బలోపేతం చేయాలి

నల్లమాడ, నవంబరు28(ఆంధ్రజ్యోతి): టీడీపీ బలోపేతానికి నాయకులు కృషి చేయాలని ఆ పార్టీ పరిశీలకుడు రమావత్ సోమ్లానాయక్ పిలుపునిచ్చారు. మండలంలోని రెడ్డిపల్లి పంచాయతీ 133వ బూత్‌లో ఆయన పర్యటించారు. ఇంటింటా తిరిగి ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమపథకాలను వివరించారు. అలాగే కార్యకర్తల్లో విభేదాలు లేకుండా కలిసికట్టుగా ఉండి, పంచాయతీ ఎన్నికల్లో గెలుపునకు కృషిచేయాలన్నారు. కన్వీనర్ మైలేశివశంకర్, కోట్లో మంజునాథ్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

టీచర్లకు టెట్ మినహాయించేలా చూడండి

● ఎంపీ బీకేకు యూటీఎఫ్ నాయకుల వినతి

అనంతపురం విద్య, నవంబరు28(ఆంధ్రజ్యోతి): సర్వీస్ టీచర్లకు టెట్ నుంచి మినహాయింపునకు కృషి చేయాలని యూటీఎఫ్ నాయకులు హిందూపురం ఎంపీ బీకే పార్థసారథికి విన్నవించారు. శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన యూటీఎఫ్ నాయకలు ఎంపీ బీకేను అనంతపురంలోని నివాసంలో శుక్రవారం కలిసి మాట్లాడారు. ప్రతి టీచర్ టెట్ రాయాలని, అందులో ఉత్తీర్ణత కాకపోతే సర్వీస్ నుంచి తొలగిస్తామనే నిబంధన సర్వీస్ టీచర్లను తీవ్ర ఆందోళనకు గురి చేస్తోందన్నారు. దశాబ్దాలుగా పాఠాలు బోధిస్తున్న వారిని ఇప్పుడు టెట్ రాయాలనడం సరికాదని అన్నారు. యూటీఎఫ్ రాష్ట్రకార్యదర్శి జయచంద్రారెడ్డి, నాయకులు సుధాకర్, నారాయణస్వామి, రామక్రిష్ణానాయక్ పాల్గొన్నారు.

మేకల అపహరణ

కొత్తచెరువు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని మీర్జాపురం గ్రా మానికి చెందిన కొత్తపల్లి చిన్న నరసింహుడుకు చెందిన 18 మేకలను గుర్తుతెలియని వ్యక్తులు గురువారం అర్దరాత్రి అపహరించారని కొత్తచెరువు పోలీసుస్టేషన్‌లో శుక్రవారం బాధితుడు ఫిర్యాదు చేశాడు. ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ మారుతీ శంకర్ తెలిపారు. చిన్ననరసింహుడు ఎప్పటిలాగానే గ్రామంలో గుడి సమీపంలోని పాకలో మేకలను తోలి ఇంటిలో నిద్రించేవాడు. గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని, శుక్రవారం ఉదయం వెళ్లి మేకలను మేతకు బయటకు వదిలేందుకువెళ్లి చూడగా అవి కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆయనతెలిపాడు.

బాలుడి మృతదేహానికి పోస్టుమార్టం పూర్తి

కదిరి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మేనమామ చేతిలో హత్యకుగురైన హర్షన్‌వర్ధన్(5) అనే బాలుడి మృతదేహానికి శుక్రవారం పోస్టుమార్టం పూర్తి చేశారు. కదిరిలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు పోస్టుమార్టం పూర్తి చేసి, మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించారు. బాలుడి మృతదేహం వద్ద తల్లిదండ్రులతోపాటు బంధువులు, స్నేహితులు బోరున విలపించారు. బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పరామర్శించారు. కుటుంబానికి తోడుగా ఉంటామని భరోసా ఇచ్చారు. నిందితుడిని కఠినంగా శిక్షించేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు చెప్పారు. ఆయనతోపాటు గరికపల్లి రామక్రిష్ణారెడ్డి ఉన్నారు.

కార్యకర్త కుటుంబానికి బీమా చెక్కు అందజేత

నల్లచెరువు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కె.పూలకంట గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త షేక్ షాకీర్ కుటుంబానికి రూ.5లక్షల బీమా చెక్కును ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ కార్యకర్తలకు అండగా నిలుస్తున్నారన్నారు. కన్వీనర్ రాజశేఖర్‌బాబు, తెలుగు యువత అధ్యక్షుడు గుత్తా ప్రసాద్, సతీష్‌చౌదరి పాల్గొన్నారు.

ఇంటిపన్ను అడిగినందుకు ఉద్యోగిపై దాడి

ధర్మవరం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఇం టి పన్ను అడిగినందు కు ఓ సచివాలయ ఉ ద్యోగిపై తల్లి, కొడుకు లు దాడిచేసిన ఘటన పట్టణంలోని గీతానగర్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. ఉద్యోగి మంజునాథ్ మాట్లాడుతూ గీతానగర్‌లో ఇంటిపన్నుల వసూళ్ల కార్యక్రమంలో భాగంగా ఆటో ద్వారా ప్రచారం చేస్తున్నామన్నారు. గీతానగర్‌లో కొళాయి మరమ్మతు చేయించి రోడ్డుపై రాళ్లు అడ్డుగా వేశారు. ఈ క్రమంలో ఆటో ద్వారా సచివాలయ ఉద్యోగులు ఇంటిపన్నులను అడిగేందుకు వెళ్లగా రోడ్డుకు అడ్డంగా ఉన్న రాళ్లను తొలగించాలని సూచించారు. దీంతో లక్ష్మీ, ఆమె కుమారుడు తనతో గొడవపడి దాడి చేశారన్నారు. దీనిపై సచివాలయ ఉద్యోగులు శుక్రవారం వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణ చేపట్టారు.

అణగారిన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావ్ ఫూలే



పూలేవిగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీసీ ఉద్యోగులు

ధర్మవరం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): సామాజిక విప్లకారుడు, అణగారిన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావు పూలే అని బీసీ ఉద్యోగులు కొనియాడారు. పూలే వర్ధంతిని పురస్కరించుకుని కాలేజీ సర్కిల్‌లో ఉన్న ఆయన విగ్రహానికి శుక్రవారం నాయకులు పూలమాలలు వేసినివాళులర్పించారు. విశ్రాంత హెచ్ఎం యజ్ఞన్న, ఈశ్వరయ్య, బలరాముడు, ఉరుకుందప్ప, నారాయణస్వామి, లక్ష్మన్న, ఆర్టీసీ నాగప్ప, నరసింహులు, చంద్ర, వెంకటేశ్, శీన, శివ, పెద్దన్న పాల్గొన్నారు.

నల్లమాడ(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో శుక్రవారం జ్యోతిరావు పూలే వర్ధంతిని అఖిలపక్షం ఆధ్వర్యంలో నిర్వహించారు. నాగలకట్ట వద్ద పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. నాయకులు బుట్టినాగభూషణ నాయుడు, విశ్రాంత ఉపాధ్యాయుడు లక్ష్మణ, పొరకల రమణ, అగిశం ప్రతాప్, కేశవ, ఆదినారాయణరెడ్డి, పూల రామయ్య, కుళ్లాయినాయక్, ఉంద్రశివారెడ్డి పాల్గొన్నారు.

అమడగూరు(ఆంధ్రజ్యోతి): మండలంలోని మహమ్మదాబాద్‌లో జ్యోతిరావు పూలే వర్ధంతిని శుక్రవారం పీఎంఆర్ జడ్పీ హైస్కూల్‌లో చింతా నాగరాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు మాట్లాడుతూ సమాజంలో రుగ్మతలను పోగొట్టడానికి ఆయన ఎంతో కృషి చేశారని చెప్పారు. కార్యక్రమంలో రామానుజులు, ఉపాధ్యాయులు బాలు, సీతారామయ్య, రుక్సానా, గంగులమ్మ, రామాంజినేయులు, ప్రసన్న, సుభాషిని, లోకోజుపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు శవశంకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

పుట్టపర్తిరూరల్(ఆంధ్రజ్యోతి): అట్టడగు వర్గాల ఆశాజ్యోతి మహాత్మ జ్యోతిరావు అని సీపీఎం నాయకులు అంకెముత్యాలు, బ్యాళ్ల అంజి అన్నారు. శుక్రవారం స్థానిక ఐద్వామహిళా సంఘం కార్యాలయంలో పూలే వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. నాయకులు సిద్ధూ, నబీ, మున్నా పాల్గొన్నారు.



పుట్టపర్తిలో నివాళి అర్పిస్తున్న సీపీఎం నాయకులు, అంగన్‌వాడీలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

ప్రతి శుక్రవారం ప్రజాదర్బార్: ఎమ్మెల్యే

కదిరి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారినికి ప్రతి శుక్రవారం నియోజకవర్గంలో ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ వాటర్ ట్యాంక్ వద్ద ప్రజాదర్బార్ నిర్వహించారు. మున్సిపాలిటీలోని 4, 5, 6, 7, 8, 31 వార్డుల్లో ఉండే ప్రజా సమస్యల పరిష్కారానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి శుక్రవారం నియోజకవర్గంలోని ఏదో ఒక ప్రాంతంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఇది ప్రభుత్వం తీసుకున్న నిర్ణయమన్నారు. గతవారం సత్యసాయి బాబా జయంతి వేడుకల సందర్భంగా నిర్వహించలేదన్నారు. ఇందుకు ఎమ్మెల్యేనైన తనకే ప్రభుత్వం షోకాజ్ నోటీసు పంపిందిదన్నారు. ప్రజాదర్బార్ పట్ల ప్రభుత్వం ఎంత శ్రద్ధవహిస్తుందో అర్థమవుతోందన్నారు. ఇక్కడ కేవలం సమస్యలు తెలుసుకోవడమేకాకుండా వాటి పరిష్కారానికి జవాబుదారి తనంగా ఉంటామన్నారు. ప్రస్తుత ప్రభుత్వ ఆలోచనలకు, గత ప్రభుత్వ ఆలోచనలకు స్పష్టమైన తేడా ఉందన్నారు. కార్యక్రమానికి 472 అర్జీలు రాగా, అందులో ఇళ్లకోసం 382, పింఛన్లకు 90 అర్జీలు వచ్చినట్లు చెప్పారు. స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ పర్వీన్‌బాను, మున్సిపల్ ఛైర్‌పర్సన్ దిల్షాదున్నీసా, వైస్ ఛైర్మన్ రాజశేఖరాచారి, కౌన్సిలర్ కిన్నెర కల్యాణ్, మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్, తహసీల్దార్ మురళీక్రిష్ణ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఎమ్మెల్యే కందికుంట ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

చిన్నారి అక్షిత్‌కు శస్త్రచికిత్స విజయవంతం

● మంత్రికి కృతజ్ఞతలు తెలిపిన తల్లిదండ్రులు



కుటుంబ సభ్యులతో కలిసి మాట్లాడుతున్న విశ్వనాథ్

ధర్మవరం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ చొరవతో చిన్నారి అక్షిత్ రెండు కాళ్లకు చేసిన శస్త్ర విజయవంత మైందని చిన్నారి తండ్రి కణం విశ్వనాథ్ తెలిపారు. స్థానిక కూటమి కార్యాలయంలో శుక్రవారం కుటుంబసభ్యులతో విశ్వనాథ్ విలేకరులతో మాట్లాడారు. తనది ముదిగుబ్బ మండలం గుంజేపల్లి గ్రామమని, తనకు కలవల పిల్లలు ఉన్నారన్నారు. వీరిలో ఒకరైన అక్షిత్ పుట్టుకతోనే నడవలేని స్థితిలో ఉన్నాడన్నారు. చిన్నారికి అనేక చోట్ల వైద్యచికిత్సలు చేయించినా ప్రయోజనం లేకపోయిందన్నారు. విషయాన్ని మంత్రి సత్యకుమార్‌యాదవ్ దృష్టికి తీసుకెళ్లానన్నారు. మంత్రి వెంటనే స్పందించి వివరాలు తెలుసుకుని తిరుపతి బర్డ్ ఆస్పత్రి వైద్యులతో మాట్లాడారన్నారు. అత్యవసర శస్త్రచికిత్స చేయించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయించి కుమారుడిని తిరుపతికి పంపించారన్నారు. మంత్రి చొరవతో కాళ్లకు చేసిన శస్త్రచికిత్స విజయవంతం అయిందని ఆయన తెలిపారు. మంత్రికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

చేనేత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

● కలెక్టర్‌కు టీడీపీ పట్టణ అధ్యక్షుడి వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న టీడీపీ నాయకులు

ధర్మవరం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): అప్పులబాధతో ఆత్మహత్య చేసుకున్న 37 మంది చేనేత కార్మికులకు రూ.10లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని టీడీపీ పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌కు విన్నవించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టర్ పట్టణంలోని పలు ప్రాంతాలలో ఉన్న హ్యాండ్‌లూమ్ మగ్గాలను పరిశీలించారు. చేనేత కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పరిశేసుధాకర్ చేనేతల సమస్యలపై కలెక్టర్‌కు వినతిపత్రాన్ని ఇచ్చారు. తహసీల్దార్ సురేశ్‌బాబు, హ్యాండ్‌లూమ్ ఏడీ రామకృష్ణ, డీఓలు రమణారెడ్డి, ఏడీఓలు సుబ్బానాయుడు, శీనానాయక్, నాగరాజు పాల్గొన్నారు.

అనాసాగరం వద్ద రోడ్డుప్రమాదం సాఫ్ట్‌వేర్ మేనేజర్ మృతి

● అమెరికాలో నివాసం.. హైదరాబాద్‌లో ఉద్యోగం
● విజయవాడకు వస్తుండగా ప్రమాదం
● ఎదురుగా ఉన్న లారీ బ్రేక్ వేయడం వల్లే..
● రూ.3 కోట్ల విలువైన కారు నుజ్జునుజ్జు
● మృతుడు పుట్టపర్తికి చెందినవారు



కారులో ఇరుక్కుపోయిన మృతదేహం

నందిగామ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా నందిగామ సమీపంలోని అనాసాగరం వద్ద జరిగిన రోడ్డుప్రమాదంలో పుట్టపర్తి జిల్లాకు చెందిన ఒకరు మృతిచెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. సేకరించిన సమాచారం ప్రకారం.. గురువారం అర్ధరాత్రి సమయంలో హైదరాబాద్ నుంచి విజయవాడ వస్తున్న కారు అనాసాగరం వద్ద బైపా‌స్‌పై ఎదురుగా వెళ్తున్న లారీని ఢీకొంది. సిమెంట్ లోడుతో వెళ్తున్న లారీ.. బైపాస్‌పై ఒక్కసారిగా నిలిపివేయడంతో వెనుకగా వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు ధ్వంసమైంది. కారులో ప్రయాణిస్తున్న చెరుకూరి చంద్రశేఖర్ (55) అక్కడికక్కడే మృతిచెందగా, జగదీశ్ అనే మరో వ్యక్తికి, డ్రైవర్‌కు గాయాలయ్యాయి. మృతుడు చంద్రశేఖర్‌తో పాటు గాయపడిన జగదీశ్ పుట్టపర్తికి చెందినవారు. అమెరికాలో నివాసం ఉంటున్న వీరిద్దరూ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ కంపెనీతో పాటు పలు వ్యాపారాలు చేస్తున్నారు. ఈపీ సాఫ్ట్‌వేర్ టీమ్ సొల్యూషన్స్ సంస్థ ఏర్పాటు చేశారు. ఈ సంస్థకు జగదీశ్ ఎండీగా, చంద్రశేఖర్ మేనేజర్‌గా ఉన్నారు. శుక్రవారం విజయవాడలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు గురువారం సాయంత్రం కారులో బయల్దేరారు. రాత్రి 12 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. కారు నుజ్జునుజ్జయ్యింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకున్నారు. గాయపడిన వారిని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చంద్రశేఖర్ భౌతికకాయానికి పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడి భార్య అమెరికా నుంచి బయల్దేరారని సీఐ వైవీవీఎల్ నాయుడు తెలిపారు.

ఖరీదైన కారైనా..

ప్రమాదానికి గురైన టయోటా లక్సస్ కారు సుమారు రూ.3 కోట్లు ఉంటుంది. ప్రమాద సమయంలో బెలూన్లు ఓపెన్ అయినా చంద్రశేఖర్‌ను కాపాడలేకపోయింది. లారీని వేగంగా ఢీకొనడం వల్ల కారు టాప్ లేచిపోయింది. ఎంత ప్రీమియం కారైనా మితిమీరిన వేగం ప్రమాదమేనని ఈ ఘటన స్పష్టం చేసింది.

ఈకేవైసీతో ఉపాధి అక్రమాలకు చెక్

వైసీపీ హయాంలో నిధులు స్వాహా
స్థానికంగా లేనివారి పేరుమీద కార్డు తీసుకుని బిల్లులు

మడకశిర రూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు తావు లేకుండా అసలైనా కూలీలకు న్యాయం జరిగే విధంగా ప్రభుత్వం చర్యలు చేపటింది. ఇందుకోసం జాబ్‌కార్డులు ఉన్న ప్రతి ఒక్క కూలీకి ఈకేవైసీ చేస్తున్నారు. ఉపాధి పనులకు వెళ్లే కూలీలు చేస్తున్న పనులపై జియో ట్యాగింగ్ చేస్తున్నారు. దీంతో ఉపాధి పనులకు వెళ్లి పనులు చేసిన కూలీలకు మాత్రమే వేతనం అందుతుంది. ఈ చర్యపై కూలీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మండలంలో 10277 జాబ్‌కార్డులు ఉన్న కూలీలు ఉన్నారు. ఇప్పటి వరకు 7900 మంది కూలీలకు ఈకేవైసీ చేసుకున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఉపాధి పనుల్లో పలు అక్రమాలు జరిగాయి. స్థానికంగా లేనివారు కూడా పనులు చేసినట్లు నమోదు చేసి నిధులు స్వాహాచేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. స్థానికంగా లేనివారి పేరు నుంచి జాబ్ కార్డులు తీసుకుని పనిచేసినట్లు వారికి సంబంధించిన బిల్లులు కూడా స్వాహా చేసినట్లు తెలుస్తోంది.

ఇలాంటి అక్రమాలకు చెక్‌పెట్టి కూలీలకు న్యాయం చేయడం కోసం ప్రభుత్వం జాబ్ కార్డు ఉన్న ప్రతి కూలీకి ఈకేవైసీ చేస్తోంది.



కూలీలకు న్యాయం జరుగుతుంది

ఈకేవైసీతో జాబ్‌కార్డులు ఉన్న అసలైన ఉపాధి కూలీలకు న్యాయం జరుగుతుంది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో కూలీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కష్టాపడేవారికే ఫలితాలు అందుతాయి. కూలీలు అందరూ ఎంతో సంతోషంలో ఈకేవైసీ చేయించుకుంటున్నారు. ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకుంది.

- రంగారెడ్డి ఉపాధి కూలీ



ఈకేవైసీ చేస్తున్న ఉపాధి సిబ్బంది

వివరాలు నమోదు చేస్తున్నాం..

మండలంలో 10277 జాబ్ కార్డులు ఉన్న కూలీలు ఉన్నారు. ఇప్పటి వరకు 7900 మంది కూలీలకు ఈకేవైసీ చేయడం జరిగింది. మరణించిన వారు, జాబ్ కార్డు ఉండి దీర్ఘకాలికంగా ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లిన కూలీలకు సంబంధించి ఇంటింటికీ వెళ్లి సమాచారం సేకరించి వారి వివరాలు నమోదు చేస్తున్నాం.

- ఏపీఓ భార్గవి

రెవెన్యూ డివిజన్ ఏర్పాటు జీఓపై హర్షం

చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం



చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న గుండుమల, నాయకులు

మడకశిర టౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం జీఓ విడుదల చేయడంతో చంద్రబాబు చిత్రపటానికి శుక్రవారం నాయకులు క్షీరాభిషేకం చేశారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ, రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ డైరెక్టర్ భక్తర్‌సాబ్, జిల్లా లీగల్‌సెల్ అధ్యక్షులు రాధా కృష్ణ, నగర పంచాయతీ చైర్మన్ నరసింహరాజు అమరాపురం బస్టాండు సర్కిల్ వద్ద సంతోషాన్ని వ్యక్తంచేశారు. సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు, మంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి బేగార్లపల్లి రవి, పట్టణ అధ్యక్షులు నాగరాజు, రూరల్ అధ్యక్షులు కల్లుమర్రి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



రొళ్లలో క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

అగళి/రొళ్ల: మడకశిర నియోజకవర్గ కేంద్రంలో ఆర్డీఓ ఆఫీస్ మంజూరు కావడం ఒక వరం లాంటిదని అగళి టీడీపీ నాయకులు పేర్కొన్నారు. దశాబ్దాల కలనేడు నెరవేర్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆర్డీఓ ఆఫీస్ మంజూరు చేస్తూ జీవో విడుదల చేయడంతో వారికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వారి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఆర్డీఓ ఆఫీస్ మంజూరుకు కృషిచేసిన ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం బస్టాండు ఆవరణంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డ్ చైర్మన్ గురుమూర్తి, వక్కళిగ రాష్ట్ర సాధికార కన్వీనర్ పాండురంగప్ప, సింగిల్‌విండో అధ్యక్షుడు దాసిరెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ ఈరన్న పాల్గొన్నారు.



అగళిలో...



హర్షం వ్యక్తం చేస్తున్న నాయకులు

● **గుడిబండ:** రెవెన్యూ డివిజన్ ఏర్పాటుపై స్థానిక టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రులకు ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు, గుండుమల తిప్పేస్వామిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి శ్రీనాథ్, బీసీసెల్ నాయకుడు జయరామప్ప, శ్రీరామ్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.



అమరాపురంలో హర్షం వ్యక్తం చేస్తున్న నాయకులు

● **అమరాపురం:** మండలకేంద్రంలో రెవెన్యూ డివిజన్ ఏర్పాటుపై హర్షం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేష్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో సహకార సంఘం అధ్యక్షుడు గణేష్, మండల కార్యదర్శి నాగరాజు, జయకుమార్, శివరుద్రప్ప పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌ను సద్వినియోగం చేసుకోండి

పట్టణ అధ్యక్షుడు నాగరాజు

మడకశిరటౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ఉదయం 11.30 గంటలకు ప్రజాదర్బార్‌ను నిర్వహించడం జరుగుతుందని పట్టణ అధ్యక్షుడు నాగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పాల్గొంటారన్నారు. ఉదయం 10.30 గంటలకు ఎమ్మెల్యే మడకశిర నగర పంచాయతీ కార్యాలయంలో జరిగే కౌన్సిల్ సమావేశానికి హాజరవుతారని, మధ్యాహ్నం 3 గంటలకు ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో పాల్గొంటారని పేర్కొన్నారు. సాయంత్రం 4.30 గంటలకు భక్తరహళ్లి లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాల నిర్వహణపై సమావేశం ఉంటుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నియోజకవర్గం ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పాపనాశేశ్వర ఆలయ నిర్మాణానికి భూమిపూజ

సోమందేపల్లి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పాపనాశేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ జరిగింది. మండలంలోని నడింపల్లి, పెద్దబాబయ్యపల్లి గ్రామాల మధ్యలో జీర్ణావస్థలో వందేళ్లనాటి పాపనాశేశ్వరస్వామి ఆలయం ఉంది. ఈ నేపథ్యంలో నూతన ఆలయ నిర్మాణానికి పోలేపల్లి నరసింహులు ఆధ్వర్యంలో గ్రామస్తులు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో పోలేపల్లి నరసింహులు, రిటైర్డ్ సివిల్ ఇంజనీర్ మాబూపీరా, బూడిదగడ్డ అశ్వర్థనారాయణ, నడింపల్లిబాబు, మీసాల మూర్తి పాల్గొన్నారు.



భూమిపూజలో పాల్గొన్న గ్రామస్తులు

కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకొస్తాం

ఏఐసీసీ జిల్లా పరిశీలకుడు అజయ్‌సింగ్

హిందూపురం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకొస్తామని ఏఐసీసీ సత్యసాయిజిల్లా పరిశీలకుడు అజయ్‌సింగ్ అన్నారు. శుక్రవారం హిందూపురం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో అజయ్‌సింగ్, రాష్ట్ర కాంగ్రెస్‌పార్టీ అధికార ప్రతినిధి తులసిరెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీకి పూర్వవైభవం తీసుకురావడానికి అదిష్టానం అడుగులు వేస్తోందన్నారు. రాష్ట్రంలో టీడీపీ, వైసీపీ దొందు దొందేనని ఎద్దేవా చేశారు. దేశం సుభిక్షంగా ఉండాలంటే కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో పార్టీ సంస్థాగత నిర్మాణంపై సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కర్ణాటకలో ఏర్పడిన గందరగోళంపై విలేకరులు ప్రశ్నించగా అదిష్టానం సీఎం సిద్దరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో మాట్లాడుతున్నారని అందరూ ఐక్యంగా ముందుకెళ్లి సమస్యను పరిష్కరించుకుంటారన్నారు. జగన్మోహన్‌రెడ్డి పాలనలో ఆంధ్రప్రదేశ్‌ను అప్పుల రాష్ట్రంగా, అవినీతి, అరాచకం, గంజాయి, డ్రగ్స్ మాఫియా రాష్ట్రంగా మార్చితే కూటమి కూడా అప్పుల్లో అలాగే ముందుకెళ్తుందన్నారు. దేశానికి, రాష్ట్రానికి కాంగ్రెస్ పాలన ఎంతో అవసరమన్నారు. దేశంలో ఎంతో ఘనచరిత్ర కలిగిన కాంగ్రెస్‌పార్టీ కుల మత పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేస్తుందన్నారు. బడుగు బలహీనవర్గాల అభ్యున్నదికి కాంగ్రెస్‌పార్టీ ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందన్నారు. అనంతరం ఫంక్షన్‌హాల్‌లో కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బద్వేల్ మాజీ ఎమ్మెల్యే కమలమ్మ, మడకశిర మాజీ ఎమ్మెల్యే సుధాకర్, కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షులు ఇనాయతుల్లా, మాజీ అధ్యక్షులు కోటా సత్యం, స్థానిక కాంగ్రెస్‌పార్టీ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అజయ్‌సింగ్

ఆదర్శప్రాయుడు.. జ్యోతిరావ్ పూలే

టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి

మడకశిరటౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): జ్యోతిరావ్ పూలే ఆదర్శ ప్రాయుడని, ఆయన జీవితం స్ఫూర్తిదాయకమనీ, ఆయన ఆశయ సాధన కోసం కృషి చేద్దామని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి అన్నారు. శుక్రవారం జ్యోతిరావ్ పూలే వర్ధంతిని పురస్కరించుకుని పట్టణంలోని అమరాపురం బస్టాండు వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జ్యోతిరావ్ పూలే వెనుకబడిన వర్గాల కోసం కృషి చేశారన్నారు.

బీఎస్పీ ఆధ్వర్యంలో..



నివాళులు అర్పిస్తున్న నాయకులు

● **హిందూపురం:** బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావుపూలేనని బీఎస్పీ నాయకులు అన్నారు. శుక్రవారం పూలే వర్ధంతిని పురస్కరించుకుని సూగూరు క్రాస్‌లో ఉన్న విగ్రహానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో సామాజిక రుగ్మతులు రూపు మాపడానికి ఆయన చేసిన కృషి ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో శ్రీరాములు, నాగరాజు, శ్రీనివాసులు మౌలాలి, చిరంజీవి, నర్సింహప్ప, గంగాధరప్ప, కొండప్ప పాల్గొన్నారు.

సేంద్రియ పద్ధతితో అధిక దిగుబడులు

జేడీఏ శ్రీరాములునాయక్

పెనుకొండ రూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో రైతులు సేంద్రీయ పద్ధతుల్లో పంటసాగుచేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని జేడీఏ శ్రీరాములునాయక్ తెలిపారు. మండలంలోని మంగాపురంలో శుక్రవారం రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా ఏరువాక శాస్త్రవేత్త రామసుబ్బయ్యతో కలిసి పంట పొలాలు పరిశీలించారు. వరిపంటసాగుపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఏడీ కృష్ణమీనన్, ఏఓ చందన, ఏఈఓ అశోక్‌కుమార్, రైతు సేవా కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పాతచామలపల్లిలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

● చిలమత్తూరు: రైతుల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళుతోందని మండల టీడీపీ కన్వీనర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. మండలంలోని పాతచామలపల్లిలో ఏఓ కవితారాణి ఆధ్వర్యంలో రైతన్న మీ కోసం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రభుత్వం నుంచి పథకాలు అందుతున్నాయా? తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఈఓ విద్య, టీడీపీ నాయకులు గౌరీశంకర్, విశ్వనాథరెడ్డి, మంజు, చంద్ర, శివప్ప, భాస్కర్ పాల్గొన్నారు.

● **అమరాపురం:** మండల పరిధిలోని మద్దనకుంట, ఉదుగూరు గ్రామాలలో రైతన్న మీకోసం కార్యక్రమాన్ని శుక్రవారం ఏఓ మంజునాథ్ నిర్వహించారు. మండల కన్వీనర్ కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి నాగరాజు, పార్లమెంట్ తెలుగుయువత ఉపాధ్యక్షులు రఘు పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న రైతు సంక్షేమ కార్యక్రమాలను పజలకు వివరించారు.



అమరాపురంలో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేస్తున్న నాయకులు

సూర్యఘర్‌కు బ్యాంకర్లు సహకరించాలి

● మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున

హిందూపురం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సూర్యఘర్ పథకానికి బ్యాంకర్లు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున కోరారు. శుక్రవారం పట్టణంలోని బ్యాంకర్లతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్యఘర్‌కు రుణాలు ఇవ్వాలని అందులో వారు సమర్పించే బిల్లుల్లో మార్పులు చేర్పులుంటే వాటిఏర్పాటుకు సహకరించాలన్నారు. మహిళా సంఘాలు రుణాలు ఇవ్వడంలో బ్యాంకర్లు చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో మెప్మా అధికారి గంగులయ్య, ఎలక్ట్రికల్ ఈఈ చంద్రనాయక్, డీఈ నాగన్న, మేనేజర్లు, పాల్గొన్నారు.

విపత్తులపై విద్యార్థులకు శిక్షణ

పరిగి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): సహజవిపత్తులు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ ఇన్‌స్పెక్టర్ శాంథిల్ బృందం శుక్రవారం కస్తూర్బా గాంధీ, జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాలు, భూకంపాలు సంభవించినప్పుడు ఏవిధమైన చర్యలు తీసుకోవాలో ఆయన వివరించారు. దట్టమైన పొగ అల్లుకునప్పుడు, ప్రాణాపాయస్థితి నుంచి తప్పించే విధంగా పలు అంశాలను తెలియజేశారు. హార్ట్‌అటాక్‌కు ఎవరైనా గురయితే వెంటనే వారికి సీపీఆర్ ఇవ్వడంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కృపాసత్యరాజ్, ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం శ్రీరామక్రిష్ణ, పటేల్, గంగాధర్, అరవిందరెడ్డి, ఖాదర్ పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

హిందూపురం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): హిందూపురం మున్సిపల్ కౌన్సిలింగ్ అత్యవసర సమావేశం ఉదయం 10.30కు జరుగుతుందని చైర్మన్ రమేష్, కమిషనర్ మల్లికార్జున తెలిపారు. ఈ సందర్భంగా అజెండాలోని అంశాలపై చర్చించనున్నారు.

పాఠశాలను సందర్శించిన డీఎంహెచ్‌ఓ



పాఠశాల పరిసర ప్రాంతాలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ

గోరంట్ల, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గిరిజన బాలికల గురుకుల పాఠశాలను శుక్రవారం జిల్లా వైద్యాధికారిణి ఫైరోజ్‌బేగం సందర్శించారు. పరిసర ప్రాంతాలు, వంటగది, మరుగుదొడ్లు తదితర వాటిని పరిశీలించారు. సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆమెతోపాటు డాక్టర్ శృతి, ప్రిన్సిపాల్ చంద్రకళ, వైద్య సిబ్బంది వెంకటేశ్వరావు తదితరులు ఉన్నారు.

సబ్ జైలును తనిఖీ చేసిన
డీఎల్ఎస్ఏ కార్యదర్శి రాజశేఖర్

హిందూపురం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్‌జైలును శుక్రవారం జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి రాజశేఖర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సబ్‌జైలులో ఉన్న రిమాండు ఖైదీలతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎప్పటి నుంచి ఉన్నారు ఏ కేసుల్లో ఉన్నారో ఆరాతీశారు. నిత్యావసర సరుకులు, కూరగాయల నాణ్యతను పరిశీలించారు. అనంతరం రాజశేఖర్ మాట్లాడుతూ క్షణికావేశంలో చేసిన తప్పులకు జైలుకు రావాల్సి వస్తుందన్నారు. మరోసారి తప్పుచేసే ముందు జాగ్రత్తపడాలన్నారు. ఈ కార్యక్రమంలో సబ్‌జైలు అధికారి హనుమప్ప, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయాధికారి రాజశేఖర్

చెరువులోకి వ్యర్థాలు

నీరు కలుషితం.. చర్యలు తీసుకోవాలంటున్న స్థానికులు



చెరువులో వ్యర్థాలు

పరిగి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): చెరువులో నీటిని కొందరు వ్యర్థాలు, చెత్తాచెదారం వేసి కలుషితం చేస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువును నమ్ముకుని పలువురు రైతులు వ్యవసాయం చేస్తున్నారన్నారు. అయితే చెరువులో పశువుల కళేబరాలు, చికెన్ షాపులోని వ్యర్థాలు, సిరంజీలు, చెత్తాచెదారం వేయడంతో చెరువు నీరు కలుషితమవుతోందని అంటున్నారు. పలుమార్లు స్థానికులు చెరువులో వ్యర్థాలు వేయకుండా అడ్డుకోవాలని అధికారుల వద్ద మొరపెట్టుకున్నా ఏమాత్రం మార్పుకనిపించలేదని అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువులో వ్యర్థాలను తొలగించాలని, తిరిగి ఎవరూ అందులో ఎలాంటి వ్యర్థాలు వేయకుండా చూడాలని కోరుతున్నారు.

'పబ్లిక్ సిట్టింగ్'పై దాడులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

చిలమత్తూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఆరుబయల్లో మద్యపానం చేస్తూ ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్న వారిపై పోలీసులు దాడులు నిర్వహించారు. గురువారం 'పబ్లిక్ సిట్టింగ్' శీర్షికన బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం అనే కథనం 'ఆంధ్రజ్యోతి' శుక్రవారం ప్రచురించిన కథనంపై ఎస్ఐ మునీర్ అహమ్మద్ స్పందించారు. సాయంత్రం పలుచోట్ల బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం చేస్తున్న వారిని పట్టుకున్నారు. వారిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వాహనదారులకు డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం చేస్తే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. జనసంచారం ఉండే ప్రాంతాల్లో సైతం మద్యపానం చేసి ప్రజలకు ఇబ్బందులు కలుగచేస్తున్నారన్న సమాచారం ఉందని, ఎవరినీ ఉపేక్షించేది లేదన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపినా కేసులు నమోదు చేసి కోర్టుకు హాజరుపరుస్తామన్నారు. మండల వ్యాప్తంగా పోలీసుల గస్తీ ఉంటుందని ఎక్కడపడితే అక్కడ మద్యపానం చేయడం మానుకోవాలని హెచ్చరించారు.

చేనేత కమిటీ ఎన్నిక



మాట్లాడుతున్న మాబు

సోమందేపల్లి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): చేనేత కార్మిక సంఘం మండల నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. పాత హైస్కూల్ ఆవరణంలో ఏర్పాటుచేసిన సీపీఎం అనుబంధ సంఘాల నాయకుల ఆధ్వర్యంలో కమిటీ ఎంపిక జరిగింది. అధ్యక్షులుగా మాబు, కార్యదర్శిగా నేసే నాగరాజు, కోశాధికారిగా షబ్బీర్‌ఖాన్‌తోపాటు 25మందితో కమిటీని ఎంపిక చేసినట్లు జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పెద్దన్న తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 11 రకాల చేనేత రిజర్వేషన్ చట్టాలను అమలు చేయాలన్నారు. లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామన్నారు. అనంతరం జ్యోతిరావు పూలే వర్ధంతిని సీఐటీయు జిల్లా కార్యదర్శి శ్రీదేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. చేనేత కార్మిక సంఘం జిల్లా నాయకులు ఎస్ఎస్‌బాషా మాట్లాడుతూ పూలే జీవన విధానం, ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. లింగ వివక్ష లేకుండా సమానత్వంతో ప్రతి ఒక్కరూ చదువుకోవాలన్నారు.

నేడు కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశం

మడకశిర టౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆదిరెడ్డిపాళ్యంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశాన్ని శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే సుధాకర్ శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ పునఃనిర్మాణం కోసం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలతో సలహాలు, సూచనలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి ఏఐసీసీ అబ్జర్వర్ అజయ్‌సింగ్, సభ్యురాలు కమలమ్మ, సీనియర్ నాయకులు తులసీరెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షులు ఇనాయతుల్లా తదితరులు హాజరవుతారన్నారు. నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కాంగ్రెస్ పాలనతో రైతులు విసిగిపోయారు

నిరసనలో బీజేపీ నాయకులు



ర్యాలీలో పాల్గొన్న బీజేపీ నాయకులు

పావగడ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పాలనపై రాష్ట్రవ్యాప్తంగా రైతులు విసిగిపోయారని బీజేపీ నాయకులు అన్నారు. రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనపై పూర్తిగా వ్యతిరేకంగా ఉన్నారన్నారు. రైతు వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీని గద్దె దించాలని శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో నాయకులు ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గ్యారంటీల పేరిట మభ్యపెట్టి అందరినీ మోసం చేస్తున్నారన్నారు. పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నిరసనలో తాలూకా అధ్యక్షుడు అశోక్, జిల్లా కార్యదర్శి రవి, బీజేపీ నాయకులు, మహిళా నాయకులు పాల్గొన్నారు.

కేకాతిలో మారెమ్మ ఉత్సవాలు



గుడిబండ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని కేకాతి గ్రామంలో గ్రామస్థుల ఆధ్వర్యంలో ఘనంగా మారెమ్మ ఉత్సవాలు జరిగాయి. శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూలతో అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారికి జ్యోతులు మోసి మొక్కులు తీర్చుకున్నారు.

రెగ్యులరైజ్ చేయండి: కాంట్రాక్టు లెక్చరర్లు

చిలమత్తూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఎంతో కాలంగా కాంట్రాక్ట్ లెక్చరర్లుగా పనిచేస్తున్నామని, తమను రెగ్యులర్ చేయాల్సిందిగా సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్లాలని కాంట్రాక్టు లెక్చరర్లు నారా బ్రాహ్మణిని కోరారు. శుక్రవారం లేపాక్షిలో పర్యటించి అనంతరం బెంగళూరు వెళుతూ చిలమత్తూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లు ఆమెకు వినతిపత్రం అందజేశారు. దీనిపై నారా బ్రాహ్మణి సానుకూలంగా స్పందించారని, విషయాన్ని వారి దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చినట్లు కాంట్రాక్టు లెక్చరర్లు తెలిపారు.